## నేటి కందం-నేటికి అందం

ఆరని ఆవేశముతో
కారిన స్వేదమ్ముతోడ కామన తోడన్
తీరగు ప్రదర్శనముతో
భారత సైన్యంబు పొందె స్వర్ణ పతకమున్ !!

(అంతర్జాతీయ స్థాయిలో,అంతర్జాతీయ ప్రమాణాలతో మూల్యాంకన చేయబడి భారత సైన్యం బంగారు పతకాన్ని సాధించింది. ఇది భారతీయు లందరికీ గర్వకారణం.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

## చురక

నిరసన గొంతులపై
నియంతృత్వ పాదం
కాక్రోచుల జైల్లో పెట్టి
కక్కుతుంది క్రోధం.
పిచ్చుకపై బ్రహ్మాస్త్రం
ప్రయోగించే దుష్ట నీతి
సామ దాన భేద దండ
చాణక్యపు యుద్ధ రీతి.



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 16-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:65 పేజీలు:6 వెల: రూ.1/-


# సింగరేణిపై సమాచారం లేకుండా మాట్లాడుతున్న కేటీఆర్: మంత్రి వివేక్

హైదరాబాద్, అక్టోబర్ 15: సింగరేణి అంశంపై సమాచారం లేకుండా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మండిపడ్డారు. లక్ష మంది ఉద్యోగులు ఉండే సింగరేణిలో ఆ సంఖ్యను 30 వేలకు తెచ్చింది గత ప్రభుత్వమేనని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా ఒక్క గని కూడా రాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి నచ్చ చెప్పి.. వేలంలో పాల్గొని గనులు దక్కించుకున్నామని వివరించారు. తాడిచెర్ల గనులు కూడా తమ కృషేనని చెప్పారు.

గురువారం హైదరాబాద్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే సింగరేణి సంస్థ ఆదాయం పెరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావే ఒప్పుకున్నరని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. చట్టాన్ని ఎలా దుర్వినియోగం చేయాలో కేటీఆర్‌కు తెలుసునన్నారు. ఉద్యమంలో కేటీఆర్ ఆస్తులు పెరిగాయని తెలిపారు. ఆయనకు వందల ఎకరాలు ఎలా వచ్చాయో విచారణ జరగాలని అన్నారు.

కేసీఆర్ రైతులను కోటీశ్వరుడిని చేస్తానని చెప్పి.. కేవలం ఆయన మాత్రమే అయ్యారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఆయన ఎలా కోటీశ్వరుడు అయ్యాడో అందరికీ చెప్పాలి కదా అని స్పష్టం చేశారు. ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ పర్యటనకు రావడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఆయన పర్యటనకు సింగరేణి నిధులు వినియోగించారనడంలో వాస్తవం లేదని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని ఫైనాన్షియల్ డిజార్డర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీ కట్టడానికే తమకు సరిపోతుందని చెప్పారు. లేబర్ బోర్డుపై వస్తున్న ఆరోపణలపై మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందించారు. అందుకు విజిలెన్స్ విచారణకు ఆదేశించామని తెలిపారు. దీనిపై నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రెండు నెలల్లో విచారణ పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. నకిలీ సర్టిఫికెట్స్ విషయంలో కొందరిపై చర్యలు తీసుకున్నామని వివరించారు. 2018 నుంచి జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతుందని మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు.

# రాహుల్ గాంధీ ప్రధాని అవడం ఖాయం.. మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, అక్టోబర్ 15: దేశ రాజకీయాల్లో మార్పులు వస్తున్నాయని.. ఈ మార్పులే రాహుల్ గాంధీని ప్రధాని చేస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పైన మండిపడ్డారు.

సింగరేణిని రేవంత్ రెడ్డి ప్రైవేటీకరణ చేస్తారన్న కేటీఆర్ ఆరోపణలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. సింగరేణిని భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్ పార్టీనేనని.. తప్పులన్నీ వాళ్లు చేసి, వాటిని తమపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారని పొంగులేటి విమర్శించారు. సింగరేణిలో 18 గనులు మూతపడడానికి కారణమైన బీఆర్ఎస్.. ఇప్పుడు మొసలికన్నీరు పెట్టుకుంటోందని విమర్శించారు.

# సింగరేణిని ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదు: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, అక్టోబర్ 15: సింగరేణిని ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈరోజు (గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 12 ఏళ్ల తర్వాత కేటీఆర్‌కు సింగరేణి గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. సింగరేణిని బీఆర్ఎస్ పార్టీ ఏటీఎంలా వాడుకుందని ఆరోపించారు. సింగరేణి ప్రతిష్ఠ దెబ్బతీసే విధంగా కేటీఆర్ వాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణి టెండర్లు పారదర్శకంగా జరుగుతున్నాయని.. అందుకే కొన్ని శక్తులు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. సింగరేణికి బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల బకాయిలు పెట్టిందని తెలిపారు. సింగరేణి సంస్థను గత పదేళ్లు నడిపింది కేటీఆర్ కుటుంబ సభ్యులు కాదా అని నిలదీశారు. కేటీఆర్ డైవర్షన్ పాలిటిక్స్ మానుకో అంటూ హితవుపలికారు.

బీఆర్ఎస్ విధానాల వల్లే సింగరేణిలో ఉత్పత్తి తగ్గిందని మంత్రి విమర్శించారు. సింగరేణి కార్మికులకు గత పదేళ్లలో ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయాలని బీఆర్ఎస్ చూసిందన్నారు. తాడిచర్ల బ్లాక్‌ను ప్రైవేటు సంస్థకు ఇచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. సింగరేణిని ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ... ఎవరైనా చేస్తా అంటే ఊరుకోమని హెచ్చరించారు. సింగరేణి బొగ్గు నాణ్యతకు అనుగుణంగా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదన్నారు.

జీ9 బొగ్గును సింగరేణి సరఫరా చేస్తుందని శ్రీధర్ బాబు అన్నారు. కేటీఆర్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవుపలికారు. యాదాద్రి థర్మల్ పవర్‌కు ప్రతి సంవత్సరం 14 మిలియన్ బొగ్గు అవసరమని.. దానికి అనుగుణంగా బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు ఉత్పత్తి ఎందుకు పెంచలేదని నిలదీశారు. కొత్త గణులపై ఎందుకు దృష్టి సారించలేదన్నారు. ఇప్పుడు అదే సమస్యగా మారి యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు ఇబ్బందిగా మారిందని.. తమ ప్రభుత్వం వచ్చాక నైనీ కోల్ బ్లాక్ నుంచి యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు సరఫరా చేస్తున్నామన్నారు. బొగ్గు ఉత్పత్తి నుంచి సరఫరా వరకు సాంకేతిక పర్యావేక్షణ ఉందని తెలిపారు.

బొగ్గు మాయం అనేది కేవలం రాజకీయ ఆరోపణే అని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన టెండర్ల విధానమే ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. అప్పుడు తప్పు కానిది ఇప్పుడు ఎలా అవుతుందని ప్రశ్నించారు. గత పదేళ్లు సింగరేణి కాంట్రాక్టులన్నీ బీఆర్ఎస్ నేతల అనుచరులకే కట్టబెట్టారని.. కళ్లున్నా చూడలేని కబోధిలా కేటీఆర్ మారారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులే లేరని కేసీఆర్ ప్రకటించారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టు ఉద్యోగులకు దసరా బోనస్ ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలు జారీ అయ్యాయి. రాబోయే మూడు గంటల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికలు సూచిస్తున్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించగా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

చిత్తూరు, పుత్తూరు, సత్యవేడు, శ్రీసిటీ, తడ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరికలు పేర్కొంటున్నాయి. గుంటూరు, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నంద్యాల, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆయా ప్రాంతాల ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. వాతావరణ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# భారతరత్న అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివి...

## - బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం...



కరీంనగర్, అక్టోబర్ 15: భారతదేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బీజేపీ మైనారిటీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ ఆధ్వర్యంలో కరీంనగర్లోని పార్లమెంట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి, అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సాయిని మల్లేశం , మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ లు మాట్లాడుతూ.. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేవలం ఒక శాస్త్రవేత్త మాత్రమే కాదని, కోట్ల మంది యువతకు రోల్ మోడల్, నిరుపమాన దేశభక్తుడని కొనియాడారు. దేశ ప్రగతికి యువత శక్తి ఎంతో కీలకమని నమ్మిన కలాం , విద్యార్థుల్లో ఉన్నతమైన ఆలోచనలు నింపడానికి తన జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు,దేశ రక్షణ కోసం అబ్దుల్ కలాం చేసిన కృషి మరువ లేనివన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, సమీయుల్లా అహ్మద్, సైద్, ఫయాజ్, అబూ బకర్, అమెర్, రౌఫ్,తదితరులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు.

# పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం.. పాఠశాల పైకప్పు కూలి విద్యార్థులు, ఉపాధ్యాయురాలి మృతి..

న్యూఢిల్లీ, అక్టోబర్ 15:పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వాయవ్య పాకిస్థాన్‌లోని పెషావర్ నగరంలో ఒక ప్రైవేటు పాఠశాల పైకప్పు కూలిపోవడంతో 21 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 30 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గురువారం తరగతులు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది.

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్ రాజధాని పెషావర్‌లోని దిర్ కాలనీలో ఈ ప్రమాదం జరిగింది. అల్ ఖైర్ పాఠశాల భవనంలోని పైకప్పు కూలిపోవడంతో తరగతి గదుల్లో ఉన్న చిన్నారులు శిథిలాల కింద చిక్కుకున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర సేవల సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గాయపడిన చిన్నారులను అంబులెన్సుల్లో ఆసుపత్రులకు తరలించారు.విద్యార్థులు, ఉపాధ్యాయురాలితో కలిపి కనీసం 21 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం వెలువడింది మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని తెలుస్తోంది. మృతులంతా చిన్న వయసు పిల్లలే కావడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు మర్రి జనార్దన్‌రెడ్డి సంఘీభావం

## డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి




నాగర్‌కర్నూల్, అక్టోబర్ 15: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కోరారు. ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య సేవల్లో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని కోరారు. అర్హులైన ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వేతనాల పెంపు, ఇతర సర్వీసు ప్రయోజనాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి, వారు తిరిగి విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్, హైమావతి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గౌస్ పాషా, కల్పన, సమన్వయకర్త ప్రవీణ్, భీముడు రామకృష్ణరెడ్డి, డాక్టర్ రాజు, డాక్టర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.




# జీవిత కాలం పాటు వెన్నెముక ఆరోగ్యం

## (అక్టోబర్ 16న "ప్రపంచ వెన్నెముక దినోత్సవం" సందర్భంగా)

వెన్నెముకను వెన్నుపూస అని కూడా పిలుస్తాం. ఇది శరీర కదలిక, శరీర భంగిమ, మొత్తం ఆరోగ్య శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. దురదృష్టవశాత్తు నడుము నొప్పి, స్కోలియోసిస్, శరీర భంగిమ సమస్యలు, వెన్నెముక వైకల్యాలు, హెర్నియేటెడ్ లేదా స్లిప్డ్ డిస్క్‌ల వంటి వెన్నెముక సంబంధిత సమస్యలు ప్రపంచవ్యాప్తంగా వైకల్యానికి ప్రధాన కారణం అవుతున్నాయి. ఈ సమస్యల వల్ల ఉత్పాదకత తగ్గడం, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీయడం, కుటుంబంపై గణనీయమైన ఆర్థిక భారం పడటానికి దారితీస్తాయి. ఈ ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి, వెన్నెముక ఆరోగ్యం కోసం ఒక కార్యాచరణ పిలుపుగా ప్రతి ఏటా ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని (వరల్డ్ స్పైన్ డే) నిర్వహిస్తారు. ఈ రోజు నివారణ, ముందస్తు సంరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంపికల ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది, అదే సమయంలో ఆరోగ్యకరమైన వెన్నెముకపై అవగాహన పెంచడానికి పౌర సమాజం, ఆరోగ్య నిపుణులు, సంబంధిత సంస్థలను ప్రోత్సహిస్తుంది.

### ప్రపంచ వెన్నెముక దినోత్సవ లక్ష్యాలు:

ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని మొట్టమొదట 2008లో "వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ కైరోప్రాక్టిక్" వారు, వెన్నెముక మరియు కండరాల ఆరోగ్యానికి పనిచేసే సంస్థల సహకారంతో పాటించారు. అప్పటి నుండి, వెన్నెముక నొప్పి, వైకల్యం, నివారణ, ఆరోగ్యకరమైన కదలికలపై దృష్టిని ఆకర్షించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 16న ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని పాటిస్తున్నారు. ఈ రోజు వెన్నెముక ఆరోగ్యంపై అవగాహన పెంచడం, ప్రజలను చురుకుగా ఉండటం, మంచి భంగిమను పాటించడం, వారి వెన్నెముకకు మద్దతుగా ఆరోగ్యకరమైన కదలిక అలవాట్లను అలవర్చుకోవడం లాంటి అంశాలను ప్రోత్సహించడంపై దృష్టి పెడుతుంది. సురక్షితమైన బరువులు ఎత్తే పద్ధతులను పాటించడం, చురుకుగా ఉండటం, ఎర్గోనామిక్ సెటప్‌లను ఉపయోగించడం, ముందస్తు సంరక్షణ, ఆరోగ్యకరమైన శరీర బరువును కలిగి ఉండడం ద్వారా వెన్నెముక సమస్యలను నివారించవచ్చు.

### ప్రపంచ వెన్నెముక దినోత్సవం-2026 ఇతివృత్తం:

ప్రపంచ వెన్నెముక దినోత్సవం-2026 ఇతివృత్తంగా "జీవిత కాలం పాటు వెన్నెముక ఆరోగ్యం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ఈ రోజు నుంచే తమ వెన్నెముకను జాగ్రత్తగా చూసుకోవడం ప్రారంభించి, ఆరోగ్యకరమైన అలవాట్లతో రాబోయే సంవత్సరాల పాటు కొనసాగించేలా ప్రోత్సహించడం దీని లక్ష్యం అవుతున్నది. మన జీవితమంతా మన వెన్నెముక మనతోనే ఉంటుంది, కాబట్టి దానికి కూడా కొంత ప్రేమ అవసరం. నడుము నొప్పి మొదలైనప్పుడు మాత్రమే వెన్నెముక సంరక్షణ గురించి ఆలోచించకూడదని తెలుసుకోవాలి. క్రమమైన దేహ కదలికలు, ఆరోగ్యకరమైన అలవాట్లు, మంచి భంగిమలు, శారీరక శ్రమ, అవగాహన ద్వారా జీవితంలోని ప్రతి దశలో వెన్నెముకను జాగ్రత్తగా చూసుకోవడంపై దృష్టి పెట్టాలి. ఆరోగ్యకరమైన వెన్నెముక బాల్యం నుండి వృద్ధాప్యం వరకు సులభమైన కదలికలు, స్వేచ్ఛయుత జీవితం, జీవన నాణ్యతకు మద్దతు ఇస్తుంది. వెన్నెముక ఆరోగ్యానికి ఏడాదికి ఒక రోజును కేటాయించడం ద్వారా, నివారణ, ముందస్తు రోగ నిర్ధారణ, చికిత్స యొక్క ఆవశ్యకతను పౌర సమాజాలు గుర్తు చేసుకుంటాయి. ఇవి జీవన నాణ్యతను గణనీయంగా మెరుగుపరిచి, వైకల్యాన్ని నివారించగలవు.

చురుకుగా ఉండటమంటే జిమ్‌లో గంటల తరబడి సమయం గడపడం కాదు. పని చేసే సమయంలో తీసుకునే చిన్నపాటి శరీర కదలికల విరామాలు, కండరాల బిగువును తగ్గించి, క్రమమైన స్వేచ్ఛా శరీర కదలికలను ప్రోత్సహించడంలో సహాయపడతాయి. నిటారుగా నిలబడటం, బెండింగ్ స్ట్రెచ్, ట్విస్టింగ్ స్ట్రెచ్, ట్రాప్ ఓపెనర్, రీచ్ టు ది స్కై, టైట్ రోప్ లంజ్, ట్రయాంగులర్ స్ట్రెచ్, షేక్ ఇట్ అవుట్ వంటి వ్యాయామాలు వెన్నెముక ఆరోగ్యానికి ఊతం ఇస్తాయి. వెన్నెముక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి జీవనశైలి అలవాట్లు, పోషకాహారం, శరీర భంగిమ కాపాడుకోవడంలో, ఎర్గోనామిక్స్ (వెన్నెముకపై అనవసరమైన ఒత్తిడిని తగ్గించడం) వంటి వాటిని కనీస దినచర్యగా పాటించవచ్చు.



-మధుపాళీ
9949700037

# భారత్‌లో బాక్సింగ్ అభివృద్ధి కోసం ఇండియన్ ఆయిల్‌తో చేతులు కలిపిన ఎన్ఎస్‌డీఎఫ్, శాయ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: భారతదేశంలో బాక్సింగ్ క్రీడను ప్రోత్సహించేందుకు జాతీయ క్రీడాభివృద్ధి నిధి (ఎన్ఎస్‌డీఎఫ్), భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, వారిని క్రమబద్ధమైన విధానంలో అభివృద్ధి చేయడంపై దృష్టి సారించే ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నారు.

దేశంలో క్రీడల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను వ్యూహాత్మకంగా వినియోగించాల్సిన ప్రాధాన్యాన్ని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రముఖంగా పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకంలోనూ ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు.

''పునరుద్ధరించిన ఖేలో ఇండియా పథకం కింద ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తోంది. ఇలాంటి సీఎస్ఆర్ నిధుల ఆధారిత భాగస్వామ్యాలు దేశవ్యాప్తంగా సమగ్ర క్రీడా వ్యవస్థ అభివృద్ధికి దోహదపడతాయి" అని డాక్టర్ మాండవీయ అన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల విభాగం (డీపీఈ) రూపొందించిన ఉమ్మడి సీఎస్ఆర్ థీమ్ విధానంలో క్రీడలను ప్రత్యేక అంశంగా చేర్చిన నేపథ్యంలో ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. క్రీడల అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇది ముఖ్యమైన ముందడుగు.

ఈ భాగస్వామ్యంలో భాగంగా, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, వారిని అభివృద్ధి చేయడం, శిక్షణ అందించడం, క్రీడా విజ్ఞానాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ స్థాయి అనుభవాన్ని కల్పించడం, బాక్సింగ్ అకాడమీలను బలోపేతం చేయడం వంటి కార్యక్రమాలకు ఇండియన్ ఆయిల్ రెండేళ్లలో రూ.40 కోట్లు అందించనుంది. కోచ్‌లు, రిఫరీలు, సాంకేతిక అధికారుల నైపుణ్యాభివృద్ధికి కూడా ఈ నిధులను వినియోగించనున్నారు.

"ఈ అవగాహన ఒప్పందం ద్వారా క్రీడల్లో కార్పొరేట్ రంగం భాగస్వామ్యం అధికృతమవుతుంది. బాక్సింగ్‌కే పరిమితం కాకుండా, ప్రతి క్రీడ అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చి సహకారం అందించాలి. క్రీడలకు ప్రారంభ దశలోనూ, అభివృద్ధి చెందుతున్న సమయంలోనూ మద్దతు అవసరం. ఆ తర్వాత క్రీడా వ్యవస్థ ఒక రూపు సంతరించుకుని, స్వయంగా నిలదొక్కుకునే స్థాయికి చేరుకున్నప్పుడు పెట్టుబడులు కూడా వాటంతట అవే వస్తాయి" అని డాక్టర్ మాండవీయ అన్నారు.

''ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, సమగ్ర బాక్సింగ్ వ్యవస్థను నిర్మించాలంటే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, క్రీడా పరికరాలు, క్రీడా విజ్ఞానం, మౌలిక సదుపాయాలు, కోచ్‌ల అభివృద్ధి, రిఫరీలకు శిక్షణ వంటి అంశాలపై కూడా పెట్టుబడులు పెట్టడం అవసరం" అని డాక్టర్ మాండవీయ స్పష్టం చేశారు.

ఈ అవగాహన ఒప్పందం ద్వారా ఇండియన్ ఆయిల్ అందించే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు, క్రీడల అభివృద్ధికి అవసరమైన వనరులను సమకూర్చడంలో జాతీయ క్రీడాభివృద్ధి నిధి (ఎన్ఎస్‌డీఎఫ్) పోషించే పాత్ర, భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్)కు ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని సమన్వయం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ భాగస్వామ్యం ద్వారా బాక్సింగ్ క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ, శాస్త్రీయ సహకారం, శిక్షణ సదుపాయాలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో పోటీపడే అవకాశాలు లభిస్తాయి.

భారత బాక్సింగ్ రంగానికి కీలకమైన సమయంలో ఈ భాగస్వామ్యం కుదిరింది. 2026 ఆసియా క్రీడల్లో భారత బాక్సర్లు మూడు స్వర్ణాలు, మూడు కాంస్య పతకాలతో కలిపి మొత్తం ఆరు పతకాలు సాధించారు. వర్ధమాన, ప్రతిభావంతులైన బాక్సర్లకు ఉన్నత అభివృద్ధి మార్గాలను బలోపేతం చేయడం ద్వారా ఈ విజయాలను మరింత ముందుకు తీసుకెళ్లడం ఈ కార్యక్రమం లక్ష్యం.

కేంద్ర క్రీడా శాఖ మంత్రితో పాటు క్రీడల శాఖ కార్యదర్శి శ్రీ హరి రంజన్ రావు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు, భారత బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడు శ్రీ అజయ్ సింగ్, ఇండియన్ ఆయిల్ మానవ వనరుల విభాగం డైరెక్టర్ శ్రీమతి రశ్మి గోవిల్ సమక్షంలో ఈ అవగాహన ఒప్పందం కుదిరింది.

1890 నాటి ఛారిటబుల్ ఎండోమెంట్స్ చట్టం కింద 1998లో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాతీయ క్రీడాభివృద్ధి నిధి (ఎన్ఎస్‌డీఎఫ్) క్రీడల అభివృద్ధి కోసం వ్యక్తులు, కార్పొరేట్ సంస్థల నుంచి వనరులను సమీకరించేందుకు దోహదపడుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వామ్యాల ద్వారా క్రీడాకారుల అభివృద్ధి, క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, క్రీడా అకాడమీల ఏర్పాటు, ప్రత్యేక శిక్షణ, క్రీడా పరికరాల సమకూర్పు, అంతర్జాతీయ స్థాయి అనుభవాన్ని అందించడం వంటి కార్యక్రమాలకు ఈ నిధిని వినియోగిస్తున్నారు.

# ఆశావహుల అభ్యర్థన మేరకు ఇండియా స్కిల్స్ 2026-27 రిజిస్ట్రేషన్ గడువు అక్టోబర్ 19 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: సంస్థల నుంచి, ఆసక్తిగల అభ్యర్థుల నుంచి వచ్చిన అనేక అభ్యర్థనల దృష్ట్యా ఇండియా స్కిల్స్ పోటీ 2026-27 రిజిస్ట్రేషన్ గడువును కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన మంత్రిత్వశాఖ (ఎంఎస్‌డీఈ) అక్టోబర్ 19, 2026 వరకు పొడిగించింది. షాంఘైలో జరిగిన వరల్డ్ స్కిల్స్ పోటీల్లో టీమిండియా అద్భుతమైన ప్రతిభను కనబరిచి, ఆరు రజత పతకాలు, 20 ఎక్సలెన్స్ పతకాలను గెలుచుకుని ప్రపంచవ్యాప్తంగా 10వ స్థానాన్ని దక్కించుకుంది. స్కిల్ పోటీలపై మళ్లీ ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఫలితం వచ్చింది.

దీన్ని మరింత బలోపేతం చేస్తూ... అక్టోబర్ 9, 2026న న్యూఢిల్లీలోని అధికారిక నివాసం 7-లోక్ కల్యాణ్ మార్గ్‌లో వరల్డ్ స్కిల్స్ షాంఘై-2026 పోటీల్లో పాల్గొన్న టీమిండియా సభ్యులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆతిథ్యమిచ్చి సత్కరించారు. భారతదేశ నైపుణ్య యువత సాధించిన విజయాలను అభినందించటమే కాక, దేశాభివృద్ధిలో వృత్తిపరమైన నైపుణ్యాల ప్రాముఖ్యతను ఈ సమావేశం స్పష్టం చేసింది. ఈ సమావేశం అనంతరం ఇండియా స్కిల్స్ 2026-27 రిజిస్ట్రేషన్లను మళ్లీ ప్రారంభించాలని విద్యాసంస్థలు, ఆసక్తిగల అభ్యర్థుల నుంచి మంత్రిత్వశాఖకు అభ్యర్థనలు అందాయి. యువత నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, జాతీయ స్థాయిలో పోటీ పడటానికి, ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం కల్పించేలా రిజిస్ట్రేషన్ గడువును అక్టోబర్ 19, 2026 వరకు పెంచారు.

జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీపడేందుకు, నైపుణ్యాలను ప్రదర్శించటానికి, యువతలో ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తూ... ఇండియా స్కిల్స్ 2026-27 కోసం ఇప్పటివరకు సుమారు 4.0 లక్షల రిజిస్ట్రేషన్లు అయ్యాయి. ఇంతకుముందు రిజిస్టర్ చేసుకోలేకపోయిన అర్హులైన అభ్యర్థులు ఇప్పుడు స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ (ఎస్ఐడీహెచ్) ద్వారా అక్టోబర్ 19, 2026లోపు దరఖాస్తులను పూర్తి చేసుకునే అవకాశం ఉంది.

ఎంఎస్‌డీఈ ఆధ్వర్యంలో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) అమలు భాగస్వామిగా తయారీ, ఇంజనీరింగ్, నిర్మాణం, డిజిటల్ టెక్నాలజీలు, సృజనాత్మక పరిశ్రమలు, సేవా రంగాలకు సంబంధించి మొత్తం 63 పరిశ్రమ-ఆధారిత నైపుణ్య విభాగాలను ఇండియా స్కిల్స్ 2026-27 కవర్ చేస్తుంది.

జిల్లా, జోనల్, రాష్ట్ర, ప్రాంతీయ, జాతీయ స్థాయిల ద్వారా సుస్థిర మార్గాన్ని ఈ పోటీ అందిస్తుంది. దీనిద్వారా ప్రతిభావంతులైన యువత నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, నిపుణుల సలహాలు పొందటానికి, అంతర్జాతీయ నైపుణ్య పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాల వైపు అడుగులు వేసేందుకు వీలవుతుంది.

పునః ప్రారంభించిన దరఖాస్తు గడువుకు సంబంధించిన సమాచారాన్ని ప్రచారం చేయాలని, రిజిస్ట్రేషన్లను సులభతరం చేయాలని? రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలనా వ్యవస్థలు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు, పాలిటెక్నిక్స్, కళాశాలలు, నైపుణ్య శిక్షణ సంస్థలు, పరిశ్రమల భాగస్వాములను మంత్రిత్వశాఖ కోరింది. భాగస్వామ్యాన్ని విస్తృతం చేయటం, మరింత మంది ఆశావహ నైపుణ్య ఛాంపియన్లను పోటీలోకి తీసుకురావటమే దీని ఉద్దేశం.

షాంఘైలో జరిగిన వరల్డ్ స్కిల్స్- 2026 పోటీల్లో టీమిండియా 10వ స్థానాన్ని సాధించింది. ఈ పోటీల్లో ఆరు రజత పతకాలు, 20 ఎక్సలెన్స్ పతకాలను గెలుచుకుంది. ఈ పోటీల్లో భారత్ నుంచి అత్యధికంగా 70 మంది పోటీదారులు, మొత్తం 63 నైపుణ్య విభాగాల్లో ప్రతిభను చాటారు. గతంలో 2024లో ఫ్రాన్స్‌లోని లియానా వేదికగా జరిగిన వరల్డ్ స్కిల్స్ పోటీల్లో భారత్ 13వ స్థానంలో ఉండగా? ఈసారి మెరుగైన ప్రదర్శనతో 10వ స్థానంలో నిలిచింది. వీరి అద్భుతమైన ప్రదర్శన... నైపుణ్యాలు, ప్రత్యేక శిక్షణ, నిరంతర సన్నద్ధత యువ భారతీయులకు అద్భుతమైన అవకాశాలను సృష్టిస్తుందనే అంశంపై దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది.

# ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలకు ఆహ్వానం

## -రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ఆదిలాబాద్, అక్టోబర్ 15: పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ల కోసం ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో, సమాజ రక్షణలో విధి నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన అమర పోలీసుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసుల త్యాగాలు, సేవలు, విధి నిర్వహణలో వారి ప్రతిభను ప్రతిబింబించే విధంగా ఫోటోలు, షార్ట్ ఫిలిమ్స్ రూపొందించాలని సూచించారు. ఆసక్తి గల వారు పోలీసులకు సంబంధించిన అంశాలపై తీసిన మూడు ఫోటోలు, మూడు నిమిషాలకు మించని ఒక షార్ట్ ఫిలింను ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా రామగుండం పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ (ఎస్ ఐ బి) కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఫోటోల సైజు 10 8 అంగుళాల పరిమాణంలో మాత్రమే ఉండాలని షార్ట్ ఫిలింను పెన్‌డ్రైవ్‌లో పూర్తి వ్యక్తిగత వివరాలతో సమర్పించాలని తెలిపారు. కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ ఫోటోలు, మూడు ఉత్తమ షార్ట్ ఫిల్మ్స్‌ను రాష్ట్రస్థాయి పోటీలకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి పంపించనున్నట్లు చెప్పారు.

# ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధుల నిర్మూలన




ఆదిలాబాద్, అక్టోబర్ 15: మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు, ముందు జాగ్రత్తలు పాటిస్తే క్యాన్సర్ తదితర వ్యాధులను నిర్మూలించొచ్చని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. దండేపల్లి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం దండేపల్లిలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు క్యాన్సర్ వ్యాధి.. ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వ్యాధి లక్షణాలను ముందే గుర్తించి జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ప్రతి మహిళ పరిసరాలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్లలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వినియోగాలను తగ్గించాలని సూచించారు.. కార్యక్రమంలో జిల్లా మహిళ సమైక్య అధ్యక్షురాలు అల్లంల అనిత, సీసీ తిరుపతి గౌడ్, సి ఎ అనంతలక్ష్మి, లైన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు కొండు రామన్న, జోనల్ చైర్ పర్సన్ మాదంశెట్టి మల్లికార్జున్, ఉపాధ్యక్షుడు బోలిశెట్టి రాజన్న, సభ్యులు కొండు జనార్ధన్, అన్నం సత్యనారాయణ, సుగుణాకర్, అలిశెట్టి లక్ష్మణ్, ముత్తినేని రమేష్, నర్సింగ్ పాల్గొన్నారు.

# తర్లపాడులో వైభవంగా బోనాల ఊరేగింపు



ఆదిలాబాద్, అక్టోబర్ 15 :దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఐదవ రోజు దుర్గామాత అమ్మవారు లలిత త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారని తర్లపాడు ఓంకారేశ్వర ఆలయ అర్చకులు మామిడిపల్లి హరీష్ కుమార్ చారి తెలిపారు.

లఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామంలోని విధుల గుండా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు, గ్రామంలో భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మండలంలోని పలు గ్రామాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# దసరాకు పాలపిట్టను వధిస్తే మూడేళ్ల జైలు శిక్ష

ఆదిలాబాద్, అక్టోబర్ 15: దసరా పండుగను పురస్కరించుకుని పాలపిట్టను వధించినా, బంధించినా, ప్రదర్శించినా నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించవచ్చని జన్నారం ఎఫ్‌డీఓ ఎం. రామ్మోహన్ తెలిపారు.

మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజనల్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం పాలపిట్టను వధించడం నేరమని చెప్పారు. దసరా పండుగ సందర్భంగా పాలపిట్టను వీక్షించడాన్ని శుభసూచకంగా పరిగణిస్తారని తెలిపారు.

పశ్చిమాసియా నుంచి భారత ఉపఖండం వరకు పాలపిట్ట జాతులు విస్తరించి ఉన్నాయని, పాలపిట్ట తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల పక్షి అని రామ్మోహన్ వివరించారు.

వ్యవసాయానికి, జనావాసాల నిర్మాణానికి, కొన్ని ప్రాంతాల్లో చెట్ల పెంపకానికి గడ్డి మైదానాలు బలవుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయానికి హాని చేసే ఎన్నో కీటకాలను తినే పాలపిట్టలను రైతునేస్తాలుగా అభివర్ణిస్తారని తెలిపారు.

వ్యవసాయ రంగంలో పురుగుమందుల విచక్షణారహిత వినియోగం వల్ల పాలపిట్టలకు ప్రధాన ఆహారమైన కీటకాలు, పురుగులు తగ్గిపోతున్నాయని, దీంతో పాలపిట్టల సంఖ్య క్షీణిస్తోందని చెప్పారు. పెద్ద చెట్లలో ఉండే రంధ్రాలు (తొర్రలు) పాలపిట్టలకు ఆవాసాలని, చెట్ల తొలగింపు వల్ల వాటి ఆవాసాలు, గూళ్లు నాశనమవుతున్నాయని వివరించారు. దీనివల్ల వాటి ప్రజననం, సంతాన వృద్ధిపై ప్రభావం పడుతోందన్నారు.

# ధర్మపురిలో అభివృద్ధి పనుల ప్రారంభం

కరీంనగర్, అక్టోబర్ 15: గ్రామీణ, పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యం, స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

గురువారం ధర్మపురి పట్టణంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి నూతన ఆరోగ్య ఉప కేంద్రం, చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్, తాగునీటి పైపులైన్లను ఆయన ప్రారంభించారు. వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి చిల్డ్రన్ పార్కులు, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఓపెన్ జిమ్‌లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, ఎలాంటి అంతరాయాలు లేకుండా పైపులైన్ల నిర్వహణను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డీఎంహెచ్ఓ సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన న్యూఢిల్లీలో
# బిమ్‌స్టెక్ హోంమంత్రుల తొలి సమావేశానికి భారత్ ఆతిథ్యం

న్యూఢిల్లీ, అక్టోబర్ 15: కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన ఈ రోజు న్యూఢిల్లీ వేదికగా జరిగిన బిమ్‌స్టెక్ హోంమంత్రుల తొలి సమావేశానికి భారత్ ఆతిథ్యమిచ్చింది. బంగాళాఖాత రీజియన్ వ్యాప్తంగా ప్రాంతీయ భద్రత, పరస్పర విశ్వాసం, సహకారం బలోపేతం పట్ల బిమ్‌స్టెక్ సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ సమావేశం పునరుద్ఘాటించింది.

సమావేశంలో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ... బిమ్‌స్టెక్ హోంమంత్రుల తొలి సమావేశానికి ఆతిథ్యమివ్వడం భారత్‌కు ఎంతో గర్వకారణం, గౌరవప్రదమైన విషయమని పేర్కొన్నారు. ప్రాంతీయ అనుసంధానం, ఆర్థిక సహకారం, సామూహిక భద్రత కోసం బిమ్‌స్టెక్ కీలక వేదికగా మారిందని ఆయన అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో... భారత్ 'విశ్వమిత్ర' స్ఫూర్తితో ముందుకు సాగుతోందని తెలిపారు. శాంతి, సహజీవనం, మానవ సంక్షేమం కోసం భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని శ్రీ అమిత్ షా వ్యాఖ్యానించారు.

2025 ఏప్రిల్ 4న బ్యాంకాక్‌లో జరిగిన 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ... "మాకు బిమ్‌స్టెక్ కేవలం ఒక ప్రాంతీయ సంస్థ మాత్రమే కాదు. ఇది మా సమ్మిళిత అభివృద్ధికి, భద్రతకు నమూనా." అంటూ చేసిన వ్యాఖ్యలను శ్రీ అమిత్ షా ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ దృక్పథాన్ని ముందుకు తీసుకువెళుతూ... మన పౌరుల భద్రతను, మన సంస్థల సామర్థ్యాలను బలోపేతం చేసే ఆచరణాత్మక విధానాలుగా మన సహకారాన్ని మలచుకోవడం హోంమంత్రులుగా మన బాధ్యత అని శ్రీ షా అన్నారు.

ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించని విధానాన్ని భారత్ అనుసరిస్తున్నదని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. ఉగ్రవాదం, సరిహద్దుల గుండా జరిగే వ్యవస్థీకృత నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా, కొత్తగా తలెత్తుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కోవడంలో సహకారాన్ని పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నేరస్థులు, ఉగ్రవాదులను న్యాయస్థానం ముందు నిలబెట్టడం కోసం... సకాలంలో నిఘా సమాచారాన్ని పంచుకోవడం, ఆర్థికపరమైన దర్యాప్తులు, పరస్పర న్యాయ సహాయం, నేరస్థుల అప్పగింత వంటి చర్యల ప్రాముఖ్యతనూ ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రాంతంలోని ఏ ప్రదేశం నుంచైనా ఉగ్రవాద నెట్‌వర్క్‌లు సురక్షిత ఆశ్రయాలు పొందకుండా, సభ్యులను నియమించుకోకుండా, శిక్షణ ఇవ్వకుండా, నిధులు సమీకరించకుండా, లేదా పొరుగు దేశాలపై కార్యకలాపాలు నిర్వహించకుండా నిరోధించడమే మనందరి ఉమ్మడి సంకల్పంగా ఉండాలని కేంద్ర హోంమంత్రి పేర్కొన్నారు. జాతీయ చట్టాలు, వర్తించే ఒప్పందాలకు అనుగుణంగా పరస్పర న్యాయ సహాయం, నేరస్థుల అప్పగింతలో సహకారం... నేరస్థులను న్యాయస్థానం ఎదుట నిలిపే మన ప్రయత్నాలను బలోపేతం చేయగలదని శ్రీ అమిత్ షా అన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణ, ఉగ్రవాద నిరోధం -న్యాయపరమైన సహకారం, పరారీలో ఉన్న నేరస్థులను స్వదేశానికి రప్పించడం, సైబర్ భద్రత-సైబర్ నేరాల దర్యాప్తు, సంస్థాగత సహకారం-సామర్థ్య నిర్మాణం అనే అయిదు కీలక సహకార రంగాల ప్రాముఖ్యతనూ కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. అక్రమ ఆర్థిక లావాదేవీలు, ఉగ్రవాదానికి నిధుల సమీకరణను ఎదుర్కోవడానికి సమన్వయంతో కూడిన ప్రాంతీయ విధానం అవసరాన్నీ ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. చట్టాలను అమలు చేసే సంస్థలు, నిఘా సంస్థలు, సరిహద్దు నిర్వహణ సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాల్సిన ప్రాముఖ్యతనూ ఆయన ఉద్ఘాటించారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాను ప్రాథమికంగా 'మృత్యు రవాణా'గా భారత్ విశ్వసిస్తోందని శ్రీ అమిత్ షా తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో 'గొప్పదనం' ఏమీ లేదనీ ఆయన పునరుద్ఘాటించారు. 'ఇది కేవలం మాదకద్రవ్యాల వ్యాపారం మాత్రమే కాదు... మన యువత జీవితాలు, సమాజం, సంస్కృతి, రాబోయే తరాల భవిష్యత్తుపై జరుగుతున్న దాడి' అని ఆయన వ్యాఖ్యానించారు. కేవలం ఒకే దేశపు ప్రయత్నాలతోనే దీనిని ఎదుర్కోలేమని కేంద్ర హోం మంత్రి అన్నారు. మనం 'సమగ్ర ప్రాంత' విధానాన్ని అవలంబించాలి. మాదకద్రవ్యాల నుంచి వచ్చే అక్రమ ఆదాయం... వ్యవస్థీకృత నేరాలకు ఆర్థిక శక్తిని అందిస్తుందనీ, దానిని ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడానికీ ఉపయోగించుకోవచ్చని శ్రీ షా పేర్కొన్నారు. ముడి రసాయనాల మళ్లింపు, డార్క్ వెబ్ ద్వారా జరిగే లావాదేవీలు ఈ సవాలును మరింత క్లిష్టతరం చేస్తున్నాయని ఆయన తెలిపారు.

బిమ్‌స్టెక్ రీజియన్ వ్యాప్తంగా విపత్తు నిర్వహణలో సహకారం తమ అత్యంత ప్రాధాన్యాల్లో ఒకటని కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా తెలిపారు. 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశం సందర్భంలో... భారత్‌లో "బిమ్‌స్టెక్ విపత్తు నిర్వహణ కేంద్రాన్ని" ఏర్పాటు చేయాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదనను ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ కేంద్రాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏర్పాటు చేయాలని యోచిస్తుండడం పట్ల శ్రీ షా సంతోషం వ్యక్తం చేశారు. ఈ రీజియన్ వ్యాప్తంగా విపత్తు నిర్వహణలో 'మొదటి ప్రతిస్పందనదారు'గా భారత్ పోషిస్తున్న ఆదర్శప్రాయమైన పాత్రను ఈ కార్యక్రమం స్పష్టం చేస్తోంది. ప్రతిపాదిత కేంద్రాన్ని కార్యాచరణలోకి తీసుకురావడంలో సభ్య దేశాలు చురుగ్గా పాలుపంచుకోవాలని ఆయన కోరారు.

ఒక సభ్య దేశం భద్రత... మొత్తం రీజియన్ భద్రతను బలోపేతం చేస్తుందని శ్రీ అమిత్ షా అన్నారు. శాంతియుతమైన, సురక్షితమైన, సంపన్నమైన బంగాళాఖాత రీజియన్ కోసం సభ్య దేశాలన్నింటితో పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారాన్ని పెంపొందించుకోవడానికి... ఈ సమావేశం ద్వారా నిర్దిష్టమైన ఫలితాలను సాధించడానికి భారత్ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

బిమ్‌స్టెక్ హోంమంత్రుల సమావేశంలో భారత ప్రతినిధి బృందానికి కేంద్ర హోంమంత్రి నాయకత్వం వహించగా... కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఉన్నతాధికారుల సమావేశానికి నాయకత్వం వహించారు. బంగ్లాదేశ్, భూటాన్, భారత్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయిలాండ్ వంటి బిమ్‌స్టెక్ సభ్య దేశాల ప్రతినిధి బృందాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

అధికారుల స్థాయి సమావేశం అనంతరం జరిగిన బిమ్‌స్టెక్ హోంమంత్రుల తొలి సమావేశం... భద్రతా రంగంలో బిమ్‌స్టెక్ చేపట్టిన వివిధ కార్యక్రమాలను సమీక్షించడానికి, తలెత్తుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రాంతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేసే భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడానికి విలువైన అవకాశాన్ని కల్పించింది.

బిమ్‌స్టెక్ హోంమంత్రుల తొలి సమావేశం ఢిల్లీ డిక్లరేషన్‌నూ ఆమోదించింది. బిమ్‌స్టెక్ కింద భద్రతా సహకారానికి మార్గనిర్దేశం చేసే వివిధ సూత్రాలను ఈ డిక్లరేషన్ వివరిస్తుంది. బిమ్‌స్టెక్ హోంమంత్రుల తొలి సమావేశంలో ఆమోదించిన ఢిల్లీ డిక్లరేషన్‌లో... ప్రాంతీయ శాంతి, భద్రత, అభివృద్ధి కోసం సహకారాన్ని బలోపేతం చేయడం పట్ల తమ నిబద్ధతను సభ్య దేశాలు పునరుద్ఘాటించాయి. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, రాడికలైజేషన్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలను సమష్టిగా ఎదుర్కోవాలని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఇది సమాచార భాగస్వామ్యం, పరస్పర న్యాయ సహాయం, నేరస్థుల అప్పగింత, సామర్థ్య నిర్మాణం, ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు, కార్యాచరణ ప్రణాళికల సమర్థ అమలుకు ప్రాధాన్యమిచ్చింది. ఆన్‌లైన్ మోసాల బారిన పడిన, మానవ అక్రమ రవాణా బాధితులకు రక్షణ కల్పించాలనీ ఇది స్పష్టం చేసింది. ప్రాంతీయ భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడంలో భారత్ నాయకత్వాన్ని ఈ డిక్లరేషన్ ప్రశంసించింది.

పోలీసు శిక్షణ, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలు, ఫోరెన్సిక్ దర్యాప్తుల్లో తన నైపుణ్యాన్ని పంచుకోవడం పట్ల తన నిబద్ధతను భారత్ పునరుద్ఘాటించింది. ఈ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ప్రతిపాదిత బిమ్‌స్టెక్ విపత్తు నిర్వహణ కేంద్రం ఏర్పాటు సహా, విపత్తు నిర్వహణలో సహకారాన్నీ ఈ సమావేశం ప్రముఖంగా ప్రస్తావించింది.

బంగాళాఖాతం రీజియన్‌లో బహుళ రంగ సాంకేతిక, ఆర్థిక సహకార కార్యక్రమం (బిమ్‌సెక్)... దక్షిణ, ఆగ్నేయాసియా సబ్-రీజియన్స్ మధ్య కీలక సంస్థాగత అనుసంధానంగా పనిచేస్తుంది. ఇది బంగ్లాదేశ్, భూటాన్, భారత్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయిలాండ్ దేశాల మధ్య బహుముఖ సహకారం, సామూహిక భద్రత, ఆర్థిక భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తుంది.

2018లో జరిగిన నాలుగో బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమా వేశంలో... సహకారం, సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల స్థాయి సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రాంతీయ భద్రతా సహకారాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా కీలక ముందడుగు వేస్తూ... ఆరో బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి భారత్ తరపున సంపూర్ణ మద్దతును ప్రకటించారు. బిమ్‌స్టెక్ హోంమంత్రుల తొలి సమావేశానికి ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ కట్టుబడి ఉందని ఆయన తెలియజేశారు.

# గనుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సముద్రగర్భ
# ఖనిజ బ్లాకుల వేలంపై అవగాహన కార్యక్రమం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 15: సముద్ర ప్రాంతాల్లోని ఖనిజ బ్లాకుల వేలంపై కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ అక్టోబర్ 13న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా వేలానికి ఉంచిన రెండు సముద్ర గర్భ ఖనిజ బ్లాకులు, వాటికి సంబంధించిన విధానాలు, నియంత్రణ నిబంధనలు, వేలం ప్రక్రియ, ఖనిజాల అన్వేషణకు అందుబాటులో ఉన్న సహాయంపై వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు, ఇతర సంబంధిత వర్గాలకు పూర్తి అవగాహన కల్పించారు.

అండమాన్ సముద్రంలో ఉన్న సెవెల్ రైజ్01, వెస్ట్ సెవెల్ రిడ్జ్-1 అనే రెండు సముద్ర గర్భ ఖనిజ బ్లాకుల నిర్వహణ హక్కుల మంజూరు కోసం గనుల మంత్రిత్వశాఖ 2026 అక్టోబర్ 1న టెండర్ ఆహ్వాన నోటీసు (ఎన్ఐటీ) జారీ చేసింది. ఈ రెండు బ్లాకుల్లో విస్తారమైన పాలీమెటాలిక్ నాడ్యూల్స్, క్రస్ట్స్ ఉన్నాయి. వీటిని కాంపోజిట్ లైసెన్స్ మంజూరు కోసం వేలానికి ఉంచారు. సెవెల్ రైజ్-01 బ్లాక్ 632 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండగా, వెస్ట్ సెవెల్ రిడ్జ్-01 బ్లాక్ 1,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. దీంతో వేలానికి ఉంచిన మొత్తం విస్తీర్ణం 1,632 చదరపు కిలోమీటర్లకు చేరింది.

భారత ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతి, ఇంధన పరివర్తన, తయారీ రంగ పోటీతత్వానికి మద్దతుగా దేశ ఖనిజ సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి కేశవ్ చంద్ర వివరించారు. భారత తూర్పు తీరంలో ఏర్పాటు చేస్తున్న కీలక ఖనిజాల ప్రాసెసింగ్ పార్కు సముద్ర ప్రాంతాల నుంచి లభించే ఖనిజాల శుద్ధికి ఎలా తోడ్పడగలదో ఆయన ప్రస్తావించారు.

గనుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ వీణా కుమారి డెర్మల్ మాట్లాడుతూ.. దేశ సముద్ర ప్రాంత ఖనిజ వనరులను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన విధానపరమైన సంస్కరణలను వివరించారు. సంబంధిత వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, సముద్ర ప్రాంతాల్లో ఖనిజాల అన్వేషణకు మరింత కార్యాచరణ సౌలభ్యాన్ని కల్పించేందుకు నాడ్యూల్స్, క్రస్ట్‌లు ఉన్న బ్లాకుల విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు వాటి విభజన, నిర్మాణంలో మార్పులు చేసినట్లు తెలిపారు. భారత ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలో సముద్ర ఖనిజాల అన్వేషణ, వెలికితీతకు సంబంధించి ప్రాథమిక పర్యావరణ గణాంకాల సేకరణ, పర్యావరణ నిర్వహణ ప్రణాళికల మార్గదర్శకాలు, విధివిధానాల ముసాయిదాను సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలకు అభిప్రాయాల కోసం పంపించినట్లు చెప్పారు. వీటిని త్వరలోనే ఖరారు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సముద్ర తీర ఖనిజ బ్లాకుల భౌగోళిక లక్షణాలు, వాటిలో ఖనిజాల లభ్యతకు ఉన్న అవకాశాలపై సమగ్ర వివరాలను భారత భూగర్భ సర్వేక్షణ సంస్థ (జీఎస్ఐ) అందించింది. లావాదేవీల సలహాదారు ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ (ఎస్‌బీఐసీఏపీఎస్) వేలానికి సంబంధించిన విధానాలు, ప్రక్రియ, టెండర్ నిబంధనలు, వేలానికి అవసరమైన షరతులను వివరించింది. వేలం వేదికను నిర్వహించే ఎంఎస్‌టీసీ సంస్థ.. ఈ-వేలం వేదిక ద్వారా టెండర్ పత్రాలను కొనుగోలు చేయడం, బిడ్లు సమర్పించడం వంటి ప్రక్రియలను దశలవారీగా ప్రదర్శించింది.

సముద్ర గర్భ ఖనిజ బ్లాకులకు సంబంధించి కాంపోజిట్ లైసెన్స్ పొందిన వారికి అన్వేషణ ఖర్చుల్లో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించే పథకాన్ని జాతీయ ఖనిజ అన్వేషణ, అభివృద్ధి ట్రస్ట్ (ఎన్ఎంఈడీటీ) ప్రవేశపెట్టింది. ఖనిజ అన్వేషణ కార్యకలాపాలకు తోడ్పడేందుకు అందుబాటులో ఉన్న ఆర్థిక సహాయాన్ని ఈ ప్రదర్శనలో వివరించారు.

గనుల మంత్రిత్వ శాఖతో, సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఈ బహిరంగ చర్చా కార్యక్రమంలో పాల్గొన్నవారు నేరుగా మాట్లాడే అవకాశాన్ని అందించింది. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు, ఇతర సంబంధిత వర్గాలు ఖనిజ బ్లాకులు, టెండర్ నిబంధనలు, వేలం ప్రక్రియలు, ఖనిజాల అన్వేషణకు అందించే సహాయానికి సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. తమ అభిప్రాయాలను కూడా పంచుకున్నారు.

ఈ వేలం 2002 నాటి సముద్ర గర్భ ప్రాంతాల ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టానికి 2023లో చేసిన సవరణలు, సముద్ర గర్భ ప్రాంతాల ఖనిజాల (వేలం) నిబంధనలు?2024కు చేసిన సవరణల ప్రకారం నిర్వహిస్తున్నారు. సముద్ర ప్రాంతాల్లోని ఖనిజ వనరుల కేటాయింపులో పారదర్శకతను నిర్ధారించడం, క్రమబద్ధమైన అన్వేషణను ప్రోత్సహించడం, ఖనిజ వనరుల సామర్థ్యాన్ని బాధ్యతాయుతంగా అభివృద్ధి చేయడం ఈ వేలం విధాన ప్రధాన లక్ష్యాలు.

పాలీమెటాలిక్ నాడ్యూల్స్, క్రస్ట్‌లలో నికెల్, కోబాల్ట్, రాగి, మాంగనీస్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి వివిధ పారిశ్రామిక అవసరాలకు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు ఇవి ఎంతో కీలకం. సముద్ర ప్రాంతాల్లో ఖనిజాల అన్వేషణను ముందుకు తీసుకెళ్లడం, దేశ ఖనిజ వనరుల నిల్వలను బలోపేతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రయత్నాల్లో ఈ కార్యక్రమం ఒక భాగం. ఈ ఖనిజ బ్లాకుల్లోని వనరుల సామర్థ్యాన్ని నిర్ధారించడానికి, భవిష్యత్తులో వాటిని అభివృద్ధి చేసే అవకాశాలను అంచనా వేయడానికి క్రమబద్ధమైన అన్వేషణ ఎంతో అవసరం.

## పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

### ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్స్ పోటీలకు ఆహ్వానం

కరీంనగర్, అక్టోబర్ 15: పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ల కోసం ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో, సమాజ రక్షణలో విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన అమర పోలీసుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలీసుల త్యాగాలు, సేవలు, విధి నిర్వహణలో వారి ప్రతిభను ప్రతిబింబించేలా ఫొటోలు, షార్ట్ ఫిల్మ్స్ రూపొందించాలని సూచించారు.

ఆసక్తి గల వారు పోలీసులకు సంబంధించిన అంశాలపై తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాలకు మించని ఒక షార్ట్ ఫిల్మ్‌ను ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా రామగుండం పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఫొటోలు 10x8 అంగుళాల పరిమాణంలో ఉండాలని, షార్ట్ ఫిల్మ్‌ను పెన్‌డ్రైవ్‌లో పూర్తి వ్యక్తిగత వివరాలతో సమర్పించాలని సూచించారు.

కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ ఫొటోలు, మూడు ఉత్తమ షార్ట్ ఫిల్మ్స్‌ను రాష్ట్రస్థాయి పోటీలకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి పంపించనున్నట్లు సీపీ తెలిపారు. యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసుల సేవలు, త్యాగాలను సమాజానికి చాటిచెప్పేలా తమ ప్రతిభను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

# ఆదిలాబాద్‌లో పేలుడు పదార్థాల ముఠా గుట్టురట్టు

### యూపీ నుంచి తెలంగాణకు భారీ ఎత్తున పేలుడు పదార్థాలు

### 20వేల డిటోనేటర్లు, 90 బూస్టర్ల పట్టివేత!



ఆదిలాబాద్, అక్టోబర్ 15:ఉత్తరప్రదేశ్ నుంచి తెలుగు రాష్ట్రాలకు యథేచ్ఛగా పేలుడు సామాగ్రిని సరఫరా చేస్తున్నముఠాను ఆదిలాబాద్ పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లాకు అక్రమంగా రవాణా చేస్తుండగా గురువారం నిఘా పెట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రూ. 20 లక్షల పైచిలుకు విలువ చేసే 20 వేల ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, 90 బూస్టర్లు, ఒక బొలెరో వాహనం, హోండా సిటీ కారు, 6 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఏడుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియా సమావేశంలో వెల్లడించారు. మైనింగ్ తవ్వకాల కోసం లైసెన్సు లేకుండానే ఈ పేలుడు పదార్థాలను కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

## ఢిల్లీ డిక్లరేషన్ ఆమోదంతో ముగిసిన తొలి బిమ్స్‌టెక్ హోంమంత్రుల సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 15:ఢిల్లీలో జరిగిన తొలి బిమ్స్‌టెక్ హోంమంత్రుల సమావేశం నేడు ఢిల్లీ ప్రకటన (డిక్లరేషన్) ఆమోదంతో విజయవంతంగా ముగిసింది.

బంగాళాఖాత ప్రాంత బహుళ రంగాల సాంకేతిక, ఆర్థిక సహకార కార్యక్రమం (బిమ్స్‌టెక్) సభ్య దేశాలైన బంగ్లాదేశ్, భూటాన్, భారత్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాల హోంమంత్రులమైన మేము అక్టోబర్ 13న భారత రాజధాని న్యూఢిల్లీలో జరిగిన తొలి బిమ్స్‌టెక్ హోంమంత్రుల సమావేశంలో పాల్గొన్నాం.

అనుసంధానిత, సురక్షిత, సంక్షోభాలను తట్టుకోగల, అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన బిమ్స్‌టెక్ ప్రాంతాన్ని సాకారం చేసేందుకు, బిమ్స్‌టెక్ పరిధిలో ప్రాంతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలన్న మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం.

సార్వభౌమ సమానత్వం, ప్రాదేశిక సమగ్రత, రాజకీయ స్వాతంత్ర్యం, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం, దురాక్రమణకు పాల్పడకపోవడం, శాంతియుత సహజీవనం, పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం అనే సూత్రాలపై బిమ్స్‌టెక్ భద్రతా సహకారం ఆధారపడి ఉంటుందని మరోసారి స్పష్టం చేస్తున్నాం. సభ్య దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక, ఉపప్రాంతీయ, ప్రాంతీయ లేదా బహుపాక్షిక సహకారానికి బిమ్స్‌టెక్ సహకారం తోడ్పడుతుందే తప్ప, దానికి ప్రత్యామ్నాయం కాదని పునరుద్ఘాటిస్తున్నాం.

ఉగ్రవాదాన్ని, సరిహద్దుల ఆవల జరిగే నేరాలను ఎదుర్కోవడంలో సహకారం, సమన్వయాన్ని పెంపొందించేందుకు బిమ్స్‌టెక్ జాతీయ భద్రతా సలహాదారులు/అధిపతుల సమావేశాలతో పాటు హోంమంత్రుల స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించాలని 2018 ఆగస్టులో ఖట్మండూలో జరిగిన నాలుగో బిమ్స్‌టెక్ శిఖరాగ్ర సమావేశం నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేసుకున్నాం.

భద్రతా రంగంలో వ్యూహాత్మక దిశానిర్దేశం చేయడంతో పాటు, సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు హోంమంత్రుల సమావేశం (హెచ్ఎంఎం) విధానాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని 2025 ఏప్రిల్ 4న బ్యాంకాక్‌లో జరిగిన ఆరో బిమ్స్‌టెక్ శిఖరాగ్ర సమావేశం స్వాగతించిన విషయాన్ని కూడా మరోసారి గుర్తు చేసుకుంటున్నాం.

బిమ్స్‌టెక్ పరిధిలో భద్రతా సహకారాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన సంస్థాగత వ్యవస్థ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలిచిన తొలి బిమ్స్‌టెక్ హోంమంత్రుల సమావేశానికి ఆతిథ్యమిచ్చిన భారత్ చొరవను అభినందిస్తున్నాం.

బంగాళాఖాత ప్రాంతం ఉమ్మడి భద్రతా ప్రదేశమని, ఇక్కడి దేశాలు పరస్పరం పంచుకునే భద్రతాపరమైన సవాళ్లకు అంతర్జాతీయ, ప్రాంతీయ కోణాలు ఉన్నాయని గుర్తించాం. ఉగ్రవాదం, ఉగ్రవాదానికి దారితీసే హింసాత్మక తీవ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాలు, సైబర్ నేరాలు, మనీలాండరింగ్, ఉగ్రవాదం, హింసాత్మక తీవ్రవాదానికి ఆర్థిక సహాయం అందించడం, మానవ అక్రమ రవాణా, ఆయుధాల అక్రమ రవాణా, సముద్ర దోపిడీలు, అక్రమ వేట, అక్రమ వలసలు, ఉగ్రవాద కార్యకలాపాల కోసం సైబర్ వ్యవస్థను దుర్వినియోగం చేయడం వంటి అంశాలు ఈ సవాళ్లలో భాగంగా ఉన్నాయి.

# ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి

### పెండింగ్ కేసుల పరిష్కారం, నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి



కరీంనగర్, అక్టోబర్ 15:జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి పోలీసు అధికారి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. ఆయా కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు పురోగతి, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్ దాఖలు తదితర అంశాలపై ఆరా తీశారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ, ప్రతి కేసులో నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీసు అధికారి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ నిబద్ధతతో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ప్రతి అధికారి తన పరిధిలోని సిబ్బంది పనితీరు, ప్రవర్తన, విధుల నిర్వహణతో పాటు వారి కదలికలపై నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరిస్తూ వాటి సంఖ్యను తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును నిర్ణీత గడువులోగా పూర్తి చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. పోక్సో కేసుల్లో దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్ దాఖలు, కోర్టు విచారణకు సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు.

జిల్లాలో దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాలను ముందస్తుగా అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను నిరంతరం కొనసాగించాలని సూచించారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ఎల్ఎంసీ తొలి పూర్తిస్థాయి ఈ-వేలం: తొలిరోజే ఆర్ఐఎన్ఎల్ భూములకు-366.33 కోట్ల బిడ్లు; 150 ప్లాట్ల విక్రయం



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 15:విశాఖపట్నంలో స్టీల్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)కు చెందిన విలువైన భూభాగాల ఈ-వేలంలో తొలిరోజు ప్రక్రియను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డీపీఈ) కింద పనిచేస్తున్న నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) విజయవంతంగా నిర్వహించింది. ఎన్ఎల్ఎంసీ చేపట్టిన తొలి ఎండ్-టు-ఎండ్ ఈ-వేలం కావడంతో మొదటి దశ ఈ సంస్థకు కీలక మైలురాయిగా నిలిచింది. మిగులు ప్రభుత్వ ఆస్తుల మానిటైజేషన్‌కు క్రమబద్ధమైన, పారదర్శక, సాంకేతిక ఆధారిత విధానాన్ని ఇది చాటింది.

మొదటి దశలో వేలానికి ఉంచిన భూభాగాల్లో 150 ప్లాట్లు విజయవంతంగా అమ్ముడయ్యాయి. వీటి మొత్తం రిజర్వు ధర ?312.48 కోట్లు కాగా, విజయవంతమైన బిడ్ల విలువ ?366.33 కోట్లకు చేరింది. రిజర్వు ధర కంటే సగటున 17.23 శాతం అధికంగా బిడ్లు నమోదయ్యాయి. వేలంలో ఉంచిన ఆస్తులపై మార్కెట్ నుంచి మంచి స్పందన, ఆసక్తి కనిపించినట్లు ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.

ఈ వేలంలో ధరలు కూడా గణనీయ స్థాయికి చేరాయి. చదరపు గజానికి గరిష్ఠ వేలం ధర ?1.80 లక్షలు దాటింది. విశాఖపట్నంలోని అనుకూల ప్రాంతాల్లో ఉన్న భూభాగాలకు బలమైన మార్కెట్ డిమాండ్ ఉందని ఈ ధర నిర్ధారణ తెలియజేస్తోంది. ప్రభుత్వ ఆస్తుల ఆర్థిక సామర్థ్యాన్ని వెలికితీయడంలో పారదర్శక, పోటీతత్వ ఈ-వేలం ప్రక్రియ పాత్రను ఇది స్పష్టం చేస్తోంది.

ఆర్ఐఎన్ఎల్ సమన్వయంతో ఎన్ఎల్ఎంసీ ఈ వేలానికి సదుపాయాలు కల్పిస్తోంది. క్విక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (క్యూఐపీఎల్) ట్రాన్సాక్షన్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తోంది. రైల్‌టెల్ ఈ-నివిదా ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈలు), ఇతర ప్రభుత్వ సంస్థల వద్ద ఉన్న మిగులు భూ ఆస్తులను ఉత్పాదకంగా వినియోగించే విస్తృత ప్రయత్నాల్లో ఈ ఈ-వేలం భాగంగా ఉంది. క్రమబద్ధమైన, మార్కెట్ ఆధారిత ప్రక్రియ ద్వారా గుర్తించిన ఆస్తులను మార్కెట్‌కు తీసుకురావడానికి ఎన్ఎల్ఎంసీ వాటి యాజమాన్య సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఈ సంస్థ కొనుగోలు దారుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ పారదర్శక ధర నిర్ధారణకు సహకరిస్తోంది.

వేలానికి ముందు 2026 సెప్టెంబర్‌లో విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లో ఎన్ఎల్ఎంసీ, ఆర్ఐఎన్ఎల్ పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాలను నిర్వహించాయి. వేలంలో ఉంచిన ఆస్తుల వివరాలను తెలుసుకోవడానికి, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, వేలంలో పాల్గొనే విధానంపై అవగాహన పొందడానికి ఈ సమావేశాలు సంభావ్య బిడ్డర్లకు అవకాశం కల్పించాయి.

రిజిస్ట్రేషన్, పత్రాలు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (ఈఎండీ) నిబంధనలు, ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు సంబంధించిన సందేహాలను కూడా ఈ అవగాహన కార్యక్రమం ద్వారా నివృత్తి చేశారు. ఈ-వేలంలో పాల్గొనే ముందు ఆసక్తి గల కొనుగోలుదారులకు అవసరమైన సమాచారం అందించడం, బిడ్డర్ల అవగాహనను విస్తరించడం, బిడ్డర్ల భాగస్వామ్యాన్ని సులభతరం చేయడం ఈ కార్యక్రమాల లక్ష్యం.

ఆర్ఐఎన్ఎల్ భూముల ఈ-వేలం తొలిరోజు విజయవంతం కావడం ప్రభుత్వ ఆస్తుల పారదర్శక, పోటీతత్వ మానిటైజేషన్‌కు ఎన్ఎల్ఎంసీ చేస్తున్న ప్రయత్నాల్లో కీలక ముందడుగుగా నిలిచింది. క్రమబద్ధంగా రూపొందించిన మార్కెట్ ప్రక్రియలు పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షించడంతో పాటు మిగులు ప్రభుత్వ ఆస్తులకు తగిన విలువను సాధించగలవని వేలానికి వచ్చిన స్పందన తెలియజేస్తోంది.

అక్టోబర్ 30న విశాఖపట్నంలో భూమిని సొంతం చేసుకునేందుకు చివరి అవకాశం: ఆర్ఐఎన్ఎల్ ఈ-వేలం రెండో దశ

తొలి దశకు లభించిన ప్రోత్సాహకర స్పందన నేపథ్యంలో విశాఖపట్నంలోని కీలక ప్రాంతాల్లో భూములను సొంతం చేసుకునేందుకు సంభావ్య కొనుగోలు దారులకు ఈ-వేలం రెండో, చివరి దశ మరో అవకాశం కల్పిస్తోంది. మిగిలిన 216 భూభాగాలను రెండో దశలో వేలం వేయనున్నారు. ఈ ప్రక్రియను 2026 అక్టోబర్ 30న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించేలా తేదీని మార్చారు. ప్రస్తుత వేలంలో ఇదే చివరి దశ కావడంతో ఆసక్తి గల కొనుగోలు దారులు అందుబాటులో ఉన్న ప్లాట్ల వివరాలను పరిశీలించి, నిర్ణీత గడువులోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సూచించారు. తొలి దశ ఫలితాలు మార్కెట్ భాగస్వామ్యం, ధర నిర్ధారణపై సంభావ్య బిడ్డర్లకు స్పష్టత ఇస్తున్నాయి. విశాఖపట్నంలో భూమిని సొంతం చేసుకోవాలని భావించేవారికి ఇది ముఖ్యమైన అవకాశంగా నిలుస్తోంది.

ఆసక్తి గల బిడ్డర్లు 2026 అక్టోబర్ 27లోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి. అందుబాటులో ఉన్న భూభాగాలు, రిజర్వు ధరలు, అర్హత నిబంధనలు, పాల్గొనేందుకు అవసరమైన వివరాలను అధికారిక ఈ-వేలం పోర్టల్‌లో పొందవచ్చు.

తుది దశ వేలంలో పాల్గొనాలనుకునే కొనుగోలుదారులు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించి, సమగ్ర విచారణ చేపట్టి, గడువులోగా అవసరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు.

## ఎన్ఎల్ఎంసీ గురించి..

నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కింద పనిచేసే భారత ప్రభుత్వ సంస్థ. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర ప్రభుత్వ ఏజెన్సీల వద్ద ఉన్న మిగులు భూములు, భవన ఆస్తుల మానిటైజేషన్‌కు ఇది సహకరిస్తుంది. ఆస్తుల యాజమాన్య సంస్థలతో సమన్వయం చేసుకుంటూ అలాంటి ఆస్తులను క్రమబద్ధంగా గుర్తించడం, సిద్ధం చేయడం, పారదర్శక, మార్కెట్ ఆధారిత ప్రక్రియల ద్వారా మానిటైజ్ చేయడంలో ఎన్ఎల్ఎంసీ సహాయం అందిస్తోంది.

# అమ్మవారి భక్తి గీతాలాపన పోటీలకు విశేష స్పందన



హైదరాబాద్, అక్టోబర్ 15:తెలుగు భాషా సంరక్షణ సంఘం కరీంనగర్ జిల్లా శాఖ, శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా-2047 సంయుక్తంగా శరన్నవ రాత్రుల పూజలు జరుగుతున్న శుభ సందర్భంగా పాఠశాల విద్యార్థినీవిద్యార్థులకు సాయి మానేరు పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన అమ్మవారి భక్తి గీతాలాపన పోటీలకు విశేష స్పందన రావడం సంతోషకరంగా ఉందని తెలుగు భాషా సంరక్షణ సంఘం అధ్యక్షులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ ఎం మహేందర్ తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణ మాట్లాడుతూ సంగీత సాహిత్యాలు అమ్మవార్ల దివ్య ప్రసాదమని, వారిని ఆశ్రయించిన భక్తులకు సకల అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని అన్నారు. సంగీతానికి భాషా భేదాలు లేవని, నేటి యువత భక్తి పాటలకు, శాస్త్రీయ సంగీతాన్ని సాధన చేయాలని తెలిపారు. ఈ పోటీలను ప్రారంభించిన కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నేటి డిజిటల్ బాల బాలికల్లో ఆధ్యాత్మిక వికాసం పెరగడానికి ఇలాంటి పోటీలు దోహదపడ తాయని అన్నారు. నేటి పిల్లల తల్లిదండ్రులు తమ బిడ్డల్లో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అవగాహనలు కల్పించాలని సూచించారు. నేటి పిల్లల్లో కొందరు భగవ ద్గీత శ్లోకాలను ధారణ చేయడం శుభ పరిణా మమని తెలిపారు. శరన్నవరాత్రుల నేపథ్య ంలో పట్టణాలు, పల్లెల పిల్లలు, పెద్దలు అమ్మవారి దీవెనల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించడం అభినందనీ యమన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న బాలబాలికలకు అందరికీ ప్రశంసా పత్రాలు, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రదానం చేశారు. అభిరామ్, దీపిక, సాత్విక్లు మొదటి మూడు బహుమతులు పొందగా నలుగురికి ప్రోత్సాహక బహుమ తులు, పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు, భగవద్గీత శ్లోకాల పుస్తకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సంరక్షణ సంఘం ఉపాధ్యక్షులు బొమ్మకంటి కిషన్ల, శాతవాహన లయన్స్ క్లబ్ నాయకులు ఎన్ ఎం మహేందర్, ఎన్ వేణు గోపాల్, లయన్ కె రాజేందర్ రెడ్డి, లయన్ డా వి శ్రీనివాస్, లయన్ పి సురేందర్ పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా సంగీత ఉపాధ్యాయిని వినీల శివపురం పాల్గొని గాయకులకు తగు మెలకువలు నేర్పి ంచారు. ఈ సందర్భంగా డా కె రామకృష్ణ, వినీలలకు నిర్వహకులు సముచితంగా సన్మానించారు.

# ఈఎస్‌టీఐసీ-2026లో 'సెమీకండక్టర్లు, నెక్స్ట్-జెన్ చిప్స్' కార్యక్రమానికి నాయకత్వం వహించనున్న డీఆర్‌డీఓ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 15:ఢిల్లీలోని భారత్ మంటపంలో 2026 అక్టోబర్ 27 నుంచి 29 వరకు నిర్వహించతలపెట్టిన 'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్'లో (ఈఎస్‌టీఐసీ-2026) 'సెమీకండక్టర్లు, నెక్స్ట్-జెన్ చిప్స్' అంశంపై జరిగే ప్రత్యేక నేపథ్య సెషన్‌కు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) నాయకత్వం వహించనుంది. కేంద్ర ప్రభుత్వ ముఖ్య శాస్త్రీయ సలహాదారు మార్గదర్శకత్వంలో 12 కేంద్ర మంత్రిత్వ శాఖలు లేదా విభాగాలు సం యుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. శాస్త్ర సాంకేతికత, ఆవిష్కరణల ద్వారా 'వికసిత్ భారత్- 2047' దార్శనికతను ముందుకు తీసుకెళ్లడం, ఆత్మనిర్భరతను బలోపేతం చేయడమే లక్ష్యంగా చేపట్టిన అత్యంత ముఖ్యమైన జాతీయ కార్యక్రమం ఇది. డీఆర్‌డీఓ నిర్వహించే ఈ సెషన్.. పరిశ్ర మలు, విద్యాసంస్థలు, స్వదేశీ చిప్-అభివృద్ధి వ్యవస్థ, రక్షణ ఎలక్ట్రానిక్స్ రంగానికి చెందిన ప్రముఖ నాయకులను ఒకే వేదికపైకి తీసుకువస్తుంది. ఇందులో మైక్రాన్ ఇండియా ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్ కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం భారత్ సెమీ సీఈఓ, నేత్రాసెమీ సీఈఓ, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ఉపన్యాసాలు ఉంటాయి. సెమీకండక్టర్ సాంకేతికతలలో కీలక పరిణా మాలు, ప్రత్యేక ప్రయోజనాల కోసం రూపొం దించిన ఏఐ సిస్టమ్- న్-చిప్‌లు, సిలికాన్ ఎడ్జ్ ఇంటెలిజెన్స్, అభి వృద్ధి చెం దుతున్న మైక్రోప్రాసెసర్ పరిశ్రమ పురో గతిపై ఆయా ప్రసంగాలు దృష్టి సారిస్తాయి. విభిన్న రంగాల్లో నిపుణులైన వక్తలు సెమీకండక్టర్ తయారీ (ఫ్యాబ్రికేషన్), చిప్ డిజైనింగ్, ఏఐ కంప్యూటింగ్, స్వదేశీ సెమీకండక్టర్ ప్లాట్‌ఫామ్‌లు, పరిశోధన- అభివృద్ధి, వ్యూహాత్మక లేదా రక్షణ రంగ వినియోగాలపై అర్థవంతమైన చర్చించనున్నారు. ఈ సెషన్ పరిశ్రమలు, విద్యా సంస్థలు, వ్యూహాత్మక భాగస్వాముల మధ్య బలమైన సహకారాన్ని పెంపొందించడానికి.. అభివృద్ధి చెం దుతున్న సాంకేతిక అవకాశా లను గుర్తిం చడానికి, కీలకమైన తదుపరి తరం అప్లికేషన్ల కోసం స్వదేశీ సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టితో బలమైన దేశీయ సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించేందుకు తోడ్పడుతుందని భావిస్తున్నారు. ఈఎస్‌టీఐసీ-2026లో ఏర్పా టు చేయనున్న ఔట్‌రీచ్ స్టాల్ కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సాధించిన కీలక ఘనతలు, పరిశోధన కార్యక్రమాలు, శాస్త్ర సాంకేతిక- ఆవిష్కరణల రంగాల్లో అందిం చిన విశేష సహకారాన్ని ప్రదర్శించడానికి ఒక ప్రధాన వేదికను అందిస్తుంది.

# డిజిటల్ పాలనను బలోపేతం చేసేందుకు డీబీఐఎం నిబంధనలతో రూపొందించిన డీఏహెచ్‌డీ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 15:దేశ డిజిటల్ పాలనా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ రూపొందించిన డిజిటల్ బ్రాండ్ ఐడెంటిటీ మాన్యువల్ (డీబీఐఎం) 3.0 నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన కొత్త డీఏహెచ్‌డీ వెబ్‌సైట్‌ను కేంద్ర ప్రభుత్వ పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ నేడు ప్రారంభించింది.

కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించిన సందర్భంగా కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, పంచాయతీరాజ్‌శాఖల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ మాట్లాడుతూ.. "పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖకు చెందిన వెబ్‌సైట్‌ను డీబీఐఎం నిబంధనలకు అనుగుణంగా రూపొందించి ప్రారంభించడం.. డిజిటల్ సేవలను మరింత విస్తరించేందుకు, ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి, పారదర్శకతను పెంపొందించడానికి, పౌరుల అవసరాలకు ప్రాధాన్యమివ్వడానికి దోహదపడే కీలక ముందడుగు. డిజిటల్ ఇండియా, కనీస ప్రభుత్వం?గరిష్ఠ పాలన అనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం" అని అన్నారు.

ఈ వెబ్‌సైట్ రూపకల్పనలో కృషి చేసిన డీఏహెచ్‌డీ ఐటీ బృందం, ఎన్ఐసీలను కేంద్ర మంత్రి అభినందించారు. పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ కొత్త వెబ్‌సైట్‌ను సందర్శించి, అందులో అందుబాటులోకి తెచ్చిన మెరుగైన సదుపాయాలను వినియోగించుకోవాలని సంబంధిత వర్గాలకు ఆయన సూచించారు. పశువుల ఆరోగ్యం, పశుసంవర్ధక పథకాలు, పాడిపరిశ్రమ అభివృద్ధి, పశువుల నిర్వహణతో పాటు శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, అందిస్తున్న సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఈ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని తెలిపారు.

కొత్తగా ప్రారంభించిన ఈ వెబ్‌సైట్ వినియోగదారులకు సమాచారాన్ని సులభంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, వెబ్‌సైట్ నిర్వహణలో ఏకరూపతను, సులభమైన నావిగేషన్ సదుపాయాన్ని మెరుగుపరుస్తుంది. ఇందులో అధునాతన శోధన సదుపాయం, భాషిణి ద్వారా బహుభాషా మద్దతు, వినియోగదారుల అవసరాలకు అనుగుణమైన నావిగేషన్, కేంద్రీకృత సమాచార నిర్వహణ వంటి ఆధునిక సదుపాయాలు ఉన్నాయి.

పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖకు చెందిన ఈ వెబ్‌సైట్.. శాఖ అమలు చేస్తున్న ప్రధాన పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని అందించే సమగ్ర డిజిటల్ వేదికగా పనిచేస్తుంది. వీటిలో పశుసంవర్ధక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఏహెచ్ఐడీఎఫ్), జాతీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం), జాతీయ పశు సంపద మిషన్ (ఎన్ఎల్ఎం), పశు సంపద ఆరోగ్యం, వ్యాధుల నియంత్రణ కార్యక్రమం (ఎల్‌హెచ్‌డీసీపీ) తదితర పథకాలు ఉన్నాయి. ఈ వెబ్‌సైట్ ద్వారా పథకాలకు సంబంధించిన సమాచారం, మార్గదర్శకాలు, వనరులు, సంబంధిత డిజిటల్ వేదికలను సులభంగా పొందవచ్చు. తద్వారా శాఖ చేపడుతున్న కార్యక్రమాలు, వాటి అమలు తీరుపై సంబంధిత వర్గాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

# పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

## తహసీల్దార్ పరుశురాం, ఎంపీడీఓ యాకూబ్ నాయక్

నల్గొండ, అక్టోబర్ 15: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతున్నట్లు తహసీల్దార్ పరశురాం, ఎంపీడీవో యాకూబ్ నాయక్ తెలిపారు. గురువారం నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ( ఇందిరమ్మ) ఇళ్లను వారు సందర్శించారు.

అక్కడ కొద్దిరోజులు నివసిస్తున్న వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 75 ఇళ్లకు గాను 300 మంది దరఖాస్తు చేసుకున్నారని, అదేవిధంగా గ్రామంలో మొత్తం 3 టీంలు పర్యటించి ఎంక్వయిరీ చేశాయని తెలిపారు. అర్హులైన వారికి మాత్రమే నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఇళ్లను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శిల్ప సతీష్ రెడ్డి, ఎంపీవో ఇస్మాయిల్, అదనపు గిర్దవార్ అక్తర్ అలీ, హౌసింగ్ ఎఈఈ వెంకటేశ్వర్లు, కార్యదర్శి షకీల్, నూకల శంకర్, వెంకన్న పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

## పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఖమ్మం, అక్టోబర్ 15: నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమవుతూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించే పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. ముఖ్యంగా కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయన ప్రారంభించారు.

పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు. వివిధ పరిస్థితుల్లో పనిచేసే క్రమంలో శారీరక ఆరోగ్యంతోపాటు కంటి చూపు కూడా కీలకమని పేర్కొన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా విధులు నిర్వర్తించాల్సి రావడం, నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం నేపథ్యంలో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం ముఖ్యమని అన్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ సిబ్బందికి అవసరమైన వైద్య సేవలు అందించేందుకు శాఖ తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

కంటి చూపులో స్వల్ప మార్పులు వచ్చినా నిర్లక్ష్యం చేయకూడదని సునీల్ దత్ సూచించారు. చూపు మసకబారడం, కళ్లలో మంట, నొప్పి వంటి సమస్యలు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందడం ద్వారా భవిష్యత్తులో తలెత్తే ఇబ్బందులను నివారించవచ్చని వివరించారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా చూపునకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వైద్యుల సలహా మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని సూచించారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సిబ్బందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు స్థితిని పరిశీలించిన వైద్యులు అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. కంటి చూపులో సమస్యలు ఉన్నట్లు గుర్తించిన సిబ్బంది వైద్యుల సూచనల మేరకు తదుపరి పరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స పొందాలని సూచించారు. ఈ శిబిరం ద్వారా పోలీస్ సిబ్బందికి కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతోపాటు సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం కల్పించారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు శాఖ ప్రాధాన్యమిస్తోందని కమిషనర్ తెలిపారు. ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమించే పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండటం విధుల సమర్థ నిర్వహణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సిబ్బంది కూడా తమ ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ వైద్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన చికిత్స పొందాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ పాశం మహేష్, అదనపు డీసీపీలు రామానుజం, కుమారస్వామి, ఏఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కామరాజు, సురేష్, శ్రీశైలం, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సీజీజీ ముస్సోరీలో భాషిణి: భౌగోళిక సరిహద్దులను దాటి విస్తరిస్తోన్న వాయిస్-ఫస్ట్ బహుభాషా ఏఐ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 15:ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (మైటీ) పరిధిలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ (డీఐసీ) కింద పనిచేస్తున్న 'డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్' (డీఐబీడీ).. 2026 అక్టోబర్ 12 నుంచి 23 వరకు ముస్సోరీలో నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌సీజీజీ) నిర్వహిస్తున్న "పట్టణ సేవలను అందించటంలో వివిధ దేశాల పౌర సేవా అధికారులకు సామర్థ్య పెంపు కార్యక్రమం"లో రియల్-టైమ్ బహుభాషా సమాచార మార్పిడి సేవలను అందించింది. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) నిధులతో భారతీయ సాంకేతిక, ఆర్థిక సహకార (ఐటీఈసీ) కార్యక్రమం ద్వారా భారత అంతర్జాతీయ సామర్థ్య నిర్మాణ ప్రయత్నాలలో భాగంగా డీఏఆర్‌పీజీ (అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్సెస్ డిపార్ట్‌మెంట్) పరిధిలోని ఎన్‌సీజీజీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో పెరూ, కంబోడియా, నైజీరియా, కెన్యా, పాలస్తీనా, లెబనాన్, ద గాంబియా, ఈక్వెడార్, స్పెయిన్ తదితర దేశాలకు చెందిన పౌర సేవా అధికారులు, ప్రభుత్వ రంగ ప్రతినిధులు పాల్గొంటున్నారు. పరిపాలన, పట్టణ సేవలను అందించటంలో అంతర్జాతీయ అనుభవాలు, ఉత్తమ విధానాల మార్పిడికి ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తుంది.

ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఇంగ్లీష్, స్పానిష్ భాషల మధ్య రియల్ టైం అనువాదాన్ని భాషిణికి చెందిన 'శ్రుత్‌లేఖ్' ప్లాట్‌ఫామ్ అందించింది. ఈ ప్లాట్‌ఫామ్ ఇంగ్లీష్ నుంచి స్పానిష్, స్పానిష్ నుంచి ఇంగ్లీష్ అనువాదం చేసింది. భాషా అడ్డంకులను అధిగమించి అంతర్జాతీయ ప్రతినిధులు ఒకరితో ఒకరు సమర్థవంతంగా సంభాషించడానికి, ఉత్సాహంగా పాల్గొనడానికి ఇది ఎంతగానో తోడ్పడింది.

ఈ వినియోగం.. భాషిణి 'వాయిస్-ఫస్ట్ బహుభాషా ఏఐ' విధానాన్ని తెలియజేస్తోంది. ఇది వాయిస్ ఆధారిత బహుభాషా సాంకేతికత ద్వారా సమాచార మార్పిడిని, డిజిటల్ సేవలను మరింత సులభతరం చేయడానికి కృషి చేస్తుంది. కార్యక్రమంలో పాల్గొనేవారు వివిధ భాషల్లో పరస్పరం మాట్లాడుకునేలా చేయడం ద్వారా ఏఐ ఆధారిత భాషా పరిష్కారాలు అంతర్జాతీయ సహకారానికి, ప్రభుత్వ రంగ సామర్థ్య నిర్మాణానికి ఏ విధంగా దోహదపడతాయో భాషిణి నిరూపించింది.

శ్రుత్‌లేఖ్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించే విధానంపై కార్యక్రమంలో పాల్గొన్నవారికి భాషిణి బృందం తగిన మార్గదర్శకత్వం అందించింది. అలాగే భాషిణి విభాగాలు, దాని బహుభాషా ఏఐ సామర్థ్యాలు.. ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక రంగం, వ్యవసాయం, పౌర సేవలందింపు వంటి వివిధ రంగాల్లో దాని వినియోగ అవకాశాలను కూడా వివరించింది. దైనందిన సంభాషణలు, డిజిటల్ లావాదేవీలలో భాషా సరిహద్దు అడ్డంకులను అధిగమించడానికి 'భాషిణి మొబైల్ అప్లికేషన్', దాని ఫీచర్లను పరిశీలించాలని ఆయా ప్రతినిధులను ప్రోత్సహించారు. 2026 అక్టోబర్ 23న ఈ కార్యక్రమం ముగిసే వరకు కార్యాచరణ అవసరాలకు అనుగుణంగా అన్ని వేళలా శ్రుత్‌లేఖ్ అందుబాటులో ఉంటుంది. వివిధ దేశాల మధ్య పరస్పర చర్యలను బలపరచడానికి, విజ్ఞాన మార్పిడిని సులభతరం చేయడానికి, అంతర్జాతీయ సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలలో మరింత సమ్మేళిత భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి 'వాయిస్-ఫస్ట్ బహుభాషా ఏఐ'కి ఉన్న సామర్థ్యాన్ని ఈ కార్యాచరణ స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ శ్రుత్‌లేఖ్ ద్వారా ఏఐ ఆధారిత భాషా సాంకేతికతలో భారత్ సాధించిన సామర్థ్యాలను, వివిధ ప్రభుత్వ రంగ వేదికలలో సులభతరమైన, బహుభాషా డిజిటల్ అనుభవాలను అందించడానికి గల అవకాశాలను 'భాషిణి' నిరంతరం ప్రదర్శిస్తోంది.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ (మైటీ) పరిధిలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ (డీఐసీ) కింద పనిచేస్తున్న 'డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్' (డీఐబీడీ), డేటాసెట్లు, ఏఐ నమూనాలు, ఏపీఐలు, బహుభాషా అప్లికేషన్ల ద్వారా భారతదేశ భాషా ఏఐ వ్యవస్థను వేగవంతంగా ముందుకు తీసుకెళ్తోంది. భారతదేశపు 'భాషా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'గా భాషిణి డిజిటల్ వేదికలు, సేవల్లో భాషా సాంకేతికతల అనుసంధానానికి మద్దతు ఇస్తుంది. భాషిణి సామర్థ్యాలతో కూడిన భాషా సాంకేతికతలు 800కి పైగా ప్రభుత్వ వెబ్‌సైట్లతో సహా 2,353 ప్రభుత్వ డిజిటల్ వేదికలలో అనుసంధానమయ్యాయి. ఈ ప్లాట్‌ఫామ్ టెక్స్ట్ రూపంలో 36 భారతీయ భాషలకు.. వాయిస్ రూపంలో 23 భారతీయ భాషలకు, 35 అంతర్జాతీయ భాషలకు మద్దతు ఇస్తుంది. రోజువారీగా 2.4 కోట్లకు పైగా ఏఐ ఇన్ఫరెన్సెస్‌తో ఇప్పటివరకు మొత్తం 900 కోట్లకు పైగా ఏఐ ఇన్ఫరెన్సెస్‌ను నమోదు చేసిన ఈ ప్లాట్‌ఫామ్.. భాషా సాంకేతికత ద్వారా డిజిటల్ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందుబాటులోకి తెచ్చేందుకు తోడ్పడింది.

# “మెరుగైన వైద్య ఫలితాల కోసం సంప్రదాయ విజ్ఞానాన్ని శాస్త్రీయ పరిశోధనతో అనుసంధానించాలి”: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 15:ఆయుర్వేదంపై శాస్త్రీయ పరిశోధనలను మరింత విస్తరించాలని ఉప రాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణణ్ పిలుపునిచ్చారు. సంప్రదాయ వైద్య విధానాల సమర్థతను నిరూపించడం, వాటిపై రోగుల్లో విశ్వాసాన్ని పెంపొందించడం, భారత్ సంప్రదాయ వైద్య విధానాలకు ప్రపంచవ్యాప్తంగా ఆమోదం లభించేలా చేయడం కోసం పరిశోధనలు అవసరమని ఆయన పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అఖిల భారత ఆయుర్వేద సంస్థ (ఏఐఐఏ) నిర్వహించిన ఆయుర్వేదంలోని కౌమారభృత్య విభాగంపై మూడో అంతర్జాతీయ సదస్సు ‘కౌమారకాన్-2026’ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అఖిల భారత ఆయుర్వేద సంస్థను ఎయిమ్స్ స్థాయికి అభివృద్ధి చేయాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ లక్ష్యాన్ని సాధించే దిశగా సంస్థ ముందుకు సాగుతోందని ఉపరాష్ట్రపతి తెలిపారు. అఖిల భారత ఆయుర్వేద సంస్థ పదో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అభినందనలు తెలిపిన ఆయన.. సంస్థ ప్రతిష్ఠను మరింత బలోపేతం చేసేందుకు పరిశోధన, ఆవిష్కరణలు, విద్యా ప్రమాణాల అత్యుత్తమతలో నిరంతర కృషి అవసరమని చెప్పారు.

భారత్‌కు చెందిన సంప్రదాయ వైద్య విధానాలు దేశ నాగరికతా విజ్ఞానం, శతాబ్దాలుగా కొనసాగుతున్న జ్ఞాన సంప్రదాయాల్లో పాతుకుపోయిన విలువైన వారసత్వమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. 2014లో ప్రత్యేకంగా ఆయుష్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడాన్ని ప్రస్తావిస్తూ.. విద్యను బలోపేతం చేయడం, ఆరోగ్య సేవలను విస్తరించడం, శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం కోసం ఆ శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ, భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), సీఎస్ఐఆర్, డీబీటీ, డీఎస్టీ, ఎయిమ్స్ వంటి సంస్థల మధ్య జరుగుతున్న అంతరశాఖ సహకారాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

ప్రముఖ వైద్య సంస్థల్లో ఆయుష్ సేవలను అనుసంధానించడాన్ని ఉప రాష్ట్రపతి ప్రస్తావించారు. ఇలాంటి కార్యక్రమాలు సంప్రదాయ వైద్య విధానాలు, ఆధునిక, వైద్య విధానాలు, ఆధునిక వైద్య సేవల మధ్య చర్చలకు, పరస్పర సహకారానికి అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. యోగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందడం, జామ్‌నగర్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సంప్రదాయ వైద్య విధానాలపై ప్రపంచ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం.. భారత్ సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో కీలక విజయంగా ఆయన పేర్కొన్నారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యతను వివరిస్తూ.. “చిన్నారుల ఆరోగ్య భవిష్యత్తుకు రూపకల్పన: కౌమారభృత్యంలో ప్రపంచ దృక్పథాలు, పరిశోధన ఆవిష్కరణలు, వైద్య రంగంలోని నూతన అవకాశాలు” అనే సదస్సు ఇతివృత్తం ప్రతి చిన్నారికి ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎదిగేలా చూడాల్సిన ఉమ్మడి బాధ్యతను ప్రతిబింబిస్తోందని ఉపరాష్ట్రపతి అన్నారు. చిన్నారుల పోషణ, ఎదుగుదల, అభివృద్ధి, వ్యాధుల నివారణ, భావోద్వేగ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని చెప్పారు.

2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణానికి చిన్నారుల ఆరోగ్యం, మానవ వనరుల నాణ్యతపై నిరంతరం దృష్టి సారించడం కూడా అవసరమని ఉపరాష్ట్రపతి తెలిపారు. సంప్రదాయ విజ్ఞానాన్ని పరిరక్షించాలని, శాస్త్రీయ పరిశోధనల ద్వారా దానికి మరింత బలం చేకూర్చాలని చెప్పారు. తమ ప్రయత్నాల్లో చిన్నారుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పరిశోధకులు, వైద్య నిపుణులకు ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆయుష్ స్టార్టప్ వేదిక, ఏఐఐఏ-ఐసీఏఐఎన్ఈ వెబ్‌సైట్, ఆయుర్వేద డిజిటల్ ఆవిష్కరణలు, వెంచర్ యాక్సిలరేషన్ సదుపాయాలను (ఆయుదివా) ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. వీటితోపాటు వామన యాప్, పంచకర్మ అంచనా యాప్‌లను కూడా ప్రారంభించారు. ఉప రాష్ట్రపతి సమక్షంలో అమెరికాలోని మహర్షి అంతర్జాతీయ విశ్వవిద్యాలయం (ఎంఐయూ), న్యూఢిల్లీలోని అఖిల భారత ఆయుర్వేద సంస్థ (ఏఐఐఏ) మధ్య అంతర్జాతీయ అవగాహన ఒప్పంద మార్పిడి జరిగింది. అంతకుముందు అఖిల భారత ఆయుర్వేద సంస్థ ఆసుపత్రి సదుపాయాలను, ధన్వంతరి వాటికను ఉపరాష్ట్రపతి సందర్శించారు. ప్రజారోగ్య రంగానికి సంస్థ అందిస్తున్న సేవల గురించి, వాటికలో ప్రదర్శించిన వివిధ ఔషధ మొక్కలు, మూలికలు, రాళ్ల ఆయుర్వేద ప్రాముఖ్యత గురించి అధికారులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల సహాయ మంత్రి శ్రీ ప్రతాప్రావ్ జాదవ్, ఆయుష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేష్ కోటెచా, ఆయుష్ మంత్రిత్వ, భారతీయ వైద్య విధానాల జాతీయ కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ మనీషా ఉపేంద్ర, న్యూఢిల్లీలోని అఖిల భారత ఆయుర్వేద సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ పీకే ప్రజాపతి, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# యేటీ భారీ బరువుల రవాణా సామర్థ్యం కలిగిన స్వయంచాలక వైమానిక వాహనం అభివృద్ధికి ఐడియాఫోర్జ్‌తో రూ.151 కోట్ల ఆర్‌డీఐ సహాయ ఒప్పందం కుదుర్చుకున్న టీడీబీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 15: స్వయంచాలక వైమానిక వ్యవస్థలు, తదుపరి తరం లాజిస్టిక్స్ రంగాల్లో భారత సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ పరిధిలోని సాంకేతిక అభివృద్ధి మండలి మహారాష్ట్రలోని ముంబయికి చెందిన ఐడియాఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. పరిశోధన అభివృద్ధి ఆవిష్కరణలు నిధి కింద ఈ సంస్థకు రూ. 151 కోట్ల ఆర్థిక సాయం అందించనుంది.

స్వయంచాలక వైమానిక వ్యవస్థలు, తదుపరి తరం లాజిస్టిక్స్ రంగాల్లో భారత సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ (డీఎస్‌టీ) పరిధిలోని సాంకేతిక అభివృద్ధి మండలి (టీడీబీ) మహారాష్ట్రలోని ముంబయికి చెందిన ఐడియాఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల (ఆర్‌డీఐ) నిధి కింద ఈ సంస్థకు రూ.151 కోట్ల ఆర్థిక సహాయం అందించనుంది.

మొత్తం రూ.302 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో భాగంగా, భారీ బరువులను సుదూర ప్రాంతాలకు రవాణా చేయగల స్వయంచాలక వైమానిక లాజిస్టిక్స్ వాహనం ‘యేటీ (వైఈటీఐ)ని అభివృద్ధి చేయనున్నారు. ఈ సాంకేతికతను సాంకేతిక సంసిద్ధత స్థాయి (టీఆర్ఎల్)-4 నుంచి టీఆర్ఎల్-9 స్థాయికి తీసుకెళ్లడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ ఆర్థిక సహాయాన్ని రుణ రూపంలో అందించనున్నారు. కఠినమైన పరిస్థితుల్లోనూ పనిచేసేలా యేటీని రూపొందిస్తున్నారు. ఇది నిలువుగా పైకి లేచి, నిలువుగా దిగగలిగే సామర్థ్యంతో పాటు స్థిర రెక్కలను కలిగిన హైబ్రిడ్ మానవరహిత వైమానిక వాహనం (వీటీఓఎల్-ఎఫ్‌డబ్ల్యూ యూఏవీ). భారీ సరుకును సుదూర ప్రాంతాలకు రవాణా చేయడం దీని ప్రధాన ఉద్దేశం. సాధారణ రవాణా సౌకర్యాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో, రవాణాకు ఎక్కువ సమయం పట్టే చోట్ల లేదా రవాణాపై నిర్వహణపరమైన పరిమితులు ఉన్న ప్రాంతాల్లో లాజిస్టిక్స్ అవసరాలను తీర్చేందుకు ఈ వాహనం ఉపయోగపడనుంది. ఈ వైమానిక వాహనం 200 కిలోల వరకు సరుకును మోసుకెళ్లేలా, గరిష్ఠంగా 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించేలా రూపొందిస్తున్నారు. సముద్ర మట్టానికి సగటున 6,500 మీటర్ల ఎత్తు వరకు పనిచేయగల సామర్థ్యం కూడా దీనికి ఉండేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీని నిర్మాణాన్ని రూపొందిస్తున్నారు. తద్వారా ఎత్తైన పర్వత ప్రాంతాలు, ఎడారులు, సముద్ర ప్రాంతాలు వంటి సవాలుతో కూడిన వాతావరణ పరిస్థితుల్లోనూ ఇది పనిచేయగలదు.

సుదూర ప్రయాణాలకు అనువుగా స్థిర రెక్కల నిర్మాణాన్ని కలిగి ఉండటంతో పాటు నిలువుగా పైకి లేచి, నిలువుగా దిగగలడమే యేటీ వాహనం ప్రత్యేకత.. సుమారు 15 మీటర్ల x 15 మీటర్ల విస్తీర్ణం కలిగిన చిన్న, ప్రత్యేకంగా సిద్ధం చేయని ప్రదేశాల నుంచే ఈ వాహనం టేకాఫ్ తీసుకుని ల్యాండ్ అయ్యేలా రూపొందిస్తున్నారు. దీనివల్ల భూమిపై మౌలిక సదుపాయాలు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లోనూ దీన్ని వినియోగించవచ్చు. సాంకేతిక లోపాలను తట్టుకునే సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ వాహనంలో పంపిణీ ఆధారిత, ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కూడిన ప్రొపల్షన్ (చోదక వ్యవస్థ), విద్యుత్ సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) సంకేతాలు అందుబాటులో లేని పరిస్థితుల్లోనూ దిశను గుర్తిస్తూ ప్రయాణించడం, 200 కిలోమీటర్ల వరకు కమ్యూనికేషన్ లింక్, సమూహంగా పనిచేసే సామర్థ్యం, కంటైనర్లలో తరలించే సౌకర్యం వంటివి కూడా ఇందులో ప్రతిపాదించారు. దీనివల్ల వాహనాన్ని వేగంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించి, తక్కువ సమయంలో సిద్ధం చేయవచ్చు. భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల్లో లాజిస్టిక్స్ కార్యకలాపాలకు ఇది తోడ్పడుతుంది.

కఠినమైన భూభాగాల మీదుగా అత్యవసర సరుకులను తరలించాల్సిన అవసరం ఉన్న రంగాల్లో భారీ బరువులను మోసుకెళ్లగల స్వయంచాలక వైమానిక వాహనాల ప్రాధాన్యం పెరుగుతోంది. నిలువుగా పైకి లేచి, దిగగల సామర్థ్యంతో పాటు సుదూర ప్రయాణ సామర్థ్యం, అధిక సరుకు మోసే సామర్థ్యాన్ని కలిపి యేటీని అభివృద్ధి చేస్తున్నారు. మానవరహిత విమానయానం, వైమానిక లాజిస్టిక్స్ మార్కెట్‌లో ప్రత్యేక అవసరాలను తీర్చడం ఈ వాహనం లక్ష్యం.

ఆర్‌డీఐ నిధుల సహకారంతో చేపట్టే ఈ కార్యక్రమం ద్వారా యేటీని టీఆర్ఎల్-9 స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన సాంకేతిక అభివృద్ధి, ఇంజినీరింగ్, వివిధ వ్యవస్థల అనుసంధానం, పరీక్షలు, పనితీరు ధ్రువీకరణ చేపడతారు. ఇవన్నీ వర్తించే సాంకేతిక, భద్రతా, నియంత్రణ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహిస్తారు. ఈ ప్రాజెక్టు ‘డీప్ టెక్నాలజీ’ రంగానికి చెందినది. ఇందులో ఉపరంగంగా ‘ఇంటెలిజెంట్ సిస్టమ్స్, రోబోటిక్స్’ను గుర్తించారు. అంతరిక్ష, విమానయాన ఇంజినీరింగ్, చోదక వ్యవస్థలు, నావిగేషన్, సమాచార వ్యవస్థలు, తెలివైన నియంత్రణ సాంకేతికతలను సమన్వయం చేసే స్వదేశీ స్వయంచాలక వ్యవస్థల ప్రాధాన్యం పెరుగుతోందని ఈ ప్రాజెక్టు ప్రతిబింబిస్తోంది.

టీడీబీ కార్యదర్శి శ్రీ రాజేశ్ కుమార్ పాఠక్ మాట్లాడుతూ.. “అధునాతన స్వయంచాలక వ్యవస్థల అభివృద్ధి సంక్లిష్టమైన కార్యకలాపాలు, లాజిస్టిక్స్ సవాళ్లను పరిష్కరించేందుకు కొత్త అవకాశాలను తెరుస్తోంది. స్వదేశంలో తయారయ్యే భారీ బరువులను మోసుకెళ్లగల వైమానిక వాహనాలు మారుమూల ప్రాంతాలకు, చేరుకోవడం కష్టమైన ప్రదేశాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించగలవు. ఆర్‌డీఐ నిధి ద్వారా అధునాతన అభివృద్ధి దశ నుంచి వాస్తవ వినియోగం దిశగా ముందుకు సాగేందుకు నిరంతర పెట్టుబడులు అవసరమయ్యే సాంకేతికత ఆధారిత ప్రాజెక్టులకు టీడీబీ సహకరిస్తోంది. ఐడియాఫోర్జ్‌తో కుదుర్చుకున్న ఈ ఒప్పందం ద్వారా స్వయంచాలక వ్యవస్థలు, రోబోటిక్స్, తదుపరి తరం అంతరిక్ష, వైమానిక సాంకేతికతల్లో భారత సామర్థ్యాలను బలోపేతం చేయాలన్న మా నిబద్ధతను చాటుతున్నాం” అని తెలిపారు.

ఈ అభివృద్ధిపై ఐడియాఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు మాట్లాడుతూ.. “భారత్ స్వయంచాలకంగా రూపొందించగల, తయారు చేయగల, నిర్వహించగల సాంకేతిక సామర్థ్యాల్లో యేటీ ఒక తరానికి సరిపడేంత ముందడుగును సూచిస్తోంది. రహదారులు ముగిసే చోట్లకు, వాతావరణ అనుకూలించని పరిస్థితుల్లోనూ చేరుకోవాల్సిన వాస్తవ సవాళ్లను మన సాయుధ దళాలు, లాజిస్టిక్స్ వ్యవస్థలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్నాయి. ఆ సవాలుకు యేటీ మా సమాధానం. అత్యంత క్లిష్టమైన కార్యకలాపాల పరిస్థితుల్లో కేవలం ఎగరడమే కాకుండా, విశ్వసనీయంగా, పదే పదే సరుకులను చేరవేసేలా దీన్ని రూపొందిస్తున్నాం. ఆర్‌డీఐ విధానం ద్వారా ఐడియాఫోర్జ్‌పై ప్రభుత్వం ఉంచిన విశ్వాసం, దేశ సామర్థ్యాలను నిర్మించడంలో కీలక బాధ్యతను చేపట్టేందుకు భారత డీప్‌టెక్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయనడానికి నిదర్శనం” అని పేర్కొన్నారు.

# 12వ ఎన్ఎల్ఈపీసీ వేదికగా 62 మంది యువ ఆవిష్కర్తలను సత్కరించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 15:ఇన్‌స్పైర్ – మానక్ పథకం కింద ఈ రోజు నిర్వహించిన 12వ జాతీయ స్థాయి ప్రదర్శన, ప్రాజెక్టుల పోటీ (ఎన్ఎల్ఈపీసీ)లో 62 మంది యువ ఆవిష్కర్తలను కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాఖల స్వతంత్ర హోదా సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సత్కరించారు. పాఠశాల విద్యార్థులు తమ ఆలోచనలను విక్రయించదగిన ఉత్పత్తులుగా తీర్చిదిద్దడంతో పాటు, వాటి ఆధారంగా వ్యాపార సంస్థలను స్థాపించే దిశగా ముందడుగు వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

25 మంది విద్యార్థులు ఇప్పటికే తమ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువచ్చారని, యువ ఆవిష్కర్తలు సుమారు 250 మేధో సంపత్తి హక్కులను సాధించారని కేంద్ర మంత్రి తెలిపారు. పాఠశాల విద్యను అభ్యసిస్తూనే కొందరు విద్యార్థులు లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సైన్స్ పట్ల ఆసక్తి, అంకితభావం, అవకాశాలు అందుబాటులో ఉండటం ద్వారా ఆలోచనలను ఆచరణాత్మక ఫలితాలుగా ఎలా మలచవచ్చో ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయని అన్నారు.

భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ (డీఎస్‌టీ), నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ – ఇండియా (ఎన్ఐఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఈ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 729 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ ఉమేశ్ వి. వాఘ్మారే, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ – ఇండియా చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అనిల్ డి. సహస్రబుద్ధే, డీఎస్‌టీ శాస్త్ర సాంకేతిక సామర్థ్య పెంపు విభాగం అధిపతి డాక్టర్ ఉమేశ్ కుమార్ శర్మ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ – ఇండియా డైరెక్టర్ డాక్టర్ అరవింద్ సి. రానడే ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు, మార్గదర్శకులు, ఇతర భాగస్వాములు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పైర్ – మానక్ 2026 ప్రత్యేక సంకలనాన్ని విడుదల చేశారు.

యువ ఆవిష్కర్తలతో ముచ్చటిస్తూ డాక్టర్ జితేంద్ర సింగ్, ఈ కార్యక్రమంలో విద్యార్థులే ప్రధాన ఆకర్షణగా నిలిచారని, వారి ఆవిష్కరణలు మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్స్ అండ్ నాలెడ్జ్ (ఇన్‌స్పైర్ – మానక్) పథకం అసలైన విలువను చాటిచెప్పాయని అన్నారు. ఈ పథకాన్ని ప్రారంభించిన సమయంలో దాని పేరుపై మొదట తనకు కొంత సందేహం కలిగిందని, అయితే, ఇందులో పాల్గొన్న విద్యార్థులు సాధించిన విజయాలు ఈ పథకం ప్రాధాన్యాన్ని, దీని ద్వారా ప్రోత్సాహం పొందుతున్న ఆవిష్కరణల ఉన్నత ప్రమాణాలను తనకు స్పష్టంగా తెలియజేశాయని ఆయన పేర్కొన్నారు.

నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలు చూపే పలు ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారని కేంద్ర మంత్రి తెలిపారు. వీటిలో మద్యం సేవించినట్లు గుర్తించినప్పుడు వాహనం స్టార్ట్ కాకుండా అడ్డుకునే కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత మద్యం గుర్తింపు వ్యవస్థ, నీటి వినియోగాన్ని తగ్గించే అల్ట్రాసోనిక్ వాషింగ్ మెషీన్, కంపనాల ద్వారా వీధి కుక్కలను దూరంగా ఉంచేందుకు రూపొందించిన పరికరం, దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉపయోగపడే సహాయక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నాయి. ప్రదర్శనలో ట్రాకింగ్ వాకింగ్ స్టిక్‌ను కూడా ప్రదర్శించినట్లు ఆయన పేర్కొన్నారు.

దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తమ చుట్టూ ఉన్న సమస్యలను గుర్తించి, విస్తృతంగా ఉపయోగపడే పరిష్కారాలను రూపొందిస్తున్నట్టు ఈ ప్రాజెక్టులు నిరూపిస్తున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. విద్యార్థులు తమ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావడంతో పాటు, మేధో సంపత్తి హక్కులను సైతం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో మొదలైన ఆవిష్కరణలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు, వాణిజ్యపరమైన విజయాలు సాధించేందుకు మార్గం సుగమం చేస్తున్నాయని ఆయన తెలిపారు.

దేశంలో విస్తరిస్తున్న స్టార్టప్ వ్యవస్థను ప్రస్తావిస్తూ, 2014లో సుమారు 350 – 400గా ఉన్న స్టార్టప్‌ల సంఖ్య ప్రస్తుతం దాదాపు 2.5 లక్షలకు చేరిందని కేంద్ర మంత్రి తెలిపారు. వీటిలో దాదాపు 60 శాతం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. నేటి యువతకు సమాచారంతో పాటు అవకాశాలు కూడా విస్తృతంగా అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి, అంకితభావం, కఠోర శ్రమతో గణనీయమైన విజయాలు సాధించవచ్చని ఆయన అన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థి ఆవిష్కర్తలు తమ ఉత్పత్తులను మరింత మెరుగు పరుచుకోవడంతో పాటు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు, వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకునేందుకు పరిశ్రమల భాగస్వామ్యాలను బలోపేతం చేయాలని డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. యువ ఆవిష్కర్తలకు పరిశ్రమలతో వ్యాపార సంబంధిత పరస్పర చర్చలకు అవకాశం కల్పించాలని సూచించారు. తద్వారా వారి ఆలోచనలపై పరిశ్రమల నుంచి అభిప్రాయాలు, సూచనలు అందడంతో పాటు, ఆ ఆవిష్కరణలను విస్తృత స్థాయిలో వినియోగంలోకి తీసుకెళ్లేందుకు మార్గం సుగమమవుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రతిభావంతమైన ఆవిష్కరణలు ప్రదర్శనలకూ, నమూనా పరికరాలకే పరిమితం కాకూడదని కేంద్ర మంత్రి అన్నారు. పారిశ్రామికవేత్తలుగా ఎదిగే సామర్థ్యం ఉన్న విద్యార్థులకు పరిశ్రమలతో కలిసి పనిచేసే అవకాశాలు కల్పించాలని, ఆచరణలో ఎదురయ్యే అవసరాలను తీర్చే పరిష్కారాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. యువ ఆవిష్కర్తలను ప్రారంభ దశలోనే సంబంధిత పరిశ్రమలతో అనుసంధానించడంతో పాటు, సాంకేతిక నిపుణుల సహకారం అందించే మార్గాలను అన్వేషించాలని భాగస్వాములకు పిలుపునిచ్చారు.

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) మద్దతు పొందే డీప్‌టెక్ స్టార్టప్‌లకు గతంలో ఉన్న మూడేళ్ల కార్యకలాపాల అనుభవ నిబంధనను తొలగిస్తూ తీసుకున్న విధానపరమైన మార్పును డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆవిష్కరణలను ప్రోత్సహించాలంటే కొత్త ఆలోచనలకు మద్దతు ఇవ్వడంతో పాటు, అంచనా వేసిన నష్టాలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థి ఆవిష్కర్తలను ప్రోత్సహించి, వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం, పరిశ్రమల మధ్య మరింత సమన్వయం అవసరమని పిలుపునిచ్చారు.

విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించేందుకు, ఆలోచనలను మెరుగుపరుచుకునేందుకు, ప్రాథమిక భావన నుంచి ఆచరణాత్మక అనువర్తనం వరకు ముందుకు సాగేందుకు మార్గదర్శకత్వం ఎంతో కీలకమని కేంద్ర మంత్రి అన్నారు. భవిష్యత్తులో నిర్వహించే ఈ కార్యక్రమంలో యువ ఆవిష్కర్తలు తమ ప్రాజెక్టులు, అనుభవాలను నేరుగా పంచుకునేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి వెంట కనీసం ఒక తల్లి/తండ్రి లేదా సంరక్షకుడు ఉండేలా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రతిపాదించారు. పిల్లలు చేపట్టే వినూత్న ప్రాజెక్టుల స్వరూపం, వాటి ప్రాధాన్యం తల్లిదండ్రులకు కొన్నిసార్లు పూర్తిగా అర్థం కాకపోవచ్చుని ఆయన అన్నారు. పిల్లలను నిరుత్సాహపరచాలనే ఉద్దేశం లేకపోయినా, ఒక ఆలోచనను ఆచరణలోకి తీసుకురావడానికి అవసరమైన సమయాన్ని, శ్రమను తల్లిదండ్రులు తెలియకుండా అడ్డుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పిల్లలు కొత్త ప్రయోగాలు చేసేందుకు, సంప్రదాయ పద్ధతులను ప్రశ్నించేందుకు, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకునేందుకు ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని కల్పించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మార్గదర్శకుల పాత్ర ఎంతో కీలకమని కేంద్ర మంత్రి అన్నారు. విద్యార్థులు తమ సామర్థ్యాలను గుర్తించడంతో పాటు తగిన మార్గదర్శకత్వం పొందాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం, అవకాశాలు నిరంతరం మారుతున్న నేపథ్యంలో కొత్త విషయాలను నేర్చుకునేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

యువ ఆవిష్కర్తలు ఒక విజయం సాధించిన తర్వాత దానితోనే సంతృప్తి చెందకుండా, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. తమ ఆసక్తులకు అనుగుణంగా వివిధ రంగాలను అన్వేషించాలని, సరైన సమాచారంతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రయోగాలు, ఆచరణాత్మక అనుభవాల ద్వారా తమ ఆలోచనలను మరింత మెరుగు పరుచుకుంటూ ముందుకు సాగాలని యువ ఆవిష్కర్తలకు పిలుపునిచ్చారు. శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ ఉమేశ్ వి. వాఘ్మారే మాట్లాడుతూ, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించుకోవచ్చో ఆలోచించే సామర్థ్యం యువ విద్యార్థుల్లో ఉందని ఈ ప్రదర్శన చాటిచెప్పిందన్నారు. అండమాన్ నికోబార్ దీవుల నుంచి కశ్మీర్ వరకు, మిజోరం నుంచి ముంబై వరకు దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషమని పేర్కొన్నారు. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగులకు అందుబాటులో ఉండే సదుపాయాలు, ఇంధనం, నీటి సంరక్షణ, భద్రత, వృద్ధుల దైనందిన జీవితాన్ని సులభతరం చేసే అంశాలతో సహా విభిన్న రంగాలకు చెందిన ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారని తెలిపారు.

ఇన్‌స్పైర్ – మానక్ శాస్త్ర సాంకేతిక శాఖ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం. డీఎస్‌టీ పరిధిలోని స్వయంప్రతిపత్తి కలిగిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ – ఇండియా సంస్థ సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం, సామాజిక అవసరాల ఆధారంగా సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలను అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

2017లో ప్రారంభమైన ఇన్‌స్పైర్ – మానక్ పథకం కింద 2025 – 26 వరకు మొత్తం 18,27,580 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పథకం కింద శాస్త్ర సాంకేతిక శాఖ ఇప్పటివరకు 11 జాతీయ స్థాయి ప్రదర్శనలు, ప్రాజెక్టుల పోటీలను నిర్వహించింది. వీటిలో 7,444 మంది విద్యార్థులు తమ వినూత్న ప్రాజెక్టులు, నమూనాలను ప్రదర్శించారు.

2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 46,926 మంది, 2024 – 25లో 50,009 మంది విద్యార్థులు ఈ పథకం కింద ఎంపికయ్యారు. ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఎంపికైన విద్యార్థులతో 12వ జాతీయ స్థాయి ప్రదర్శన, ప్రాజెక్టుల పోటీని (ఎన్ఎల్ఈపీసీ) నిర్వహించారు. తమ ప్రాజెక్టులను జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు, నిపుణులతో ముఖాముఖి చర్చించేందుకు, వారి నుంచి మార్గదర్శకత్వం పొందడంతో పాటు నూతన విషయాలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఈ కార్యక్రమం విద్యార్థులకు వేదికగా నిలిచింది.

ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులు తమ ఆలోచనలను నమూనాలుగా, ప్రాథమిక సాధ్యాసాధ్యాలను నిరూపించే ప్రోటోటైప్‌లుగా అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తారు. వర్క్‌షాప్‌లు, నిపుణులతో చర్చలు, ప్రముఖ సాంకేతిక సంస్థలతో పరస్పర సంప్రదింపుల ద్వారా తమ ప్రాజెక్టులను మరింత మెరుగుపరుచుకునే అవకాశాలు కల్పిస్తారు. చిన్న వయస్సు నుంచే శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించే దిశగా విద్యార్థులను ప్రోత్సహించడం ఈ పథకం ఉద్దేశం

యువ ఆవిష్కర్తలను అభినందించిన డాక్టర్ జితేంద్ర సింగ్.. ప్రశ్నించడం, ప్రయోగాలు చేయడం, నిరంతరం నేర్చుకోవడం కొనసాగించాలని సూచించారు. తమ ఆలోచనలను మరింత అభివృద్ధి చేసుకునేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం అందించడం ద్వారా దేశ ఆవిష్కరణల వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి

## రోజుకు కనీసం 40 మంది కూలీలకు తగ్గకుండా పనులు కల్పించాలి

నల్గొండ, అక్టోబర్ 15: నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలంలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీరాజ్ అధికారి వనం తరుణ్ చక్రవర్తి అధికారులకు సూచించారు.

గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వి.బి.జి. రామ్ జీ పథకం అమలు తీరుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు.

అనంతరం మండలంలోని తేరటుపల్లి గ్రామంలో చేపట్టిన ఫామ్ పాండ్ (వ్యవసాయ కుంట) పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారం పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, రోజుకు కనీసం 40 మంది కూలీలకు తగ్గకుండా పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని తరుణ్ చక్రవర్తి సూచించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని, రైతులు తమ వ్యవసాయ భూముల్లోనూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో సునీత, సీనియర్ అసిస్టెంట్ తాటి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ శశిధర్, పంచాయతీ కార్యదర్శులు భరత్, స్వామి, సైదులు, కృష్ణ, రాకేష్, వనజ, గీత, ఈజీఎస్ సాంకేతిక అధికారి లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

# నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా స్పందన రాజీవ్

నల్గొండ, అక్టోబర్ 15: నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన యువ మహిళా నేత చలసాని స్పందన రాజీవ్ చైర్మన్‌గా, పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన మునగాల భాస్కర్‌రెడ్డి వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. వారితోపాటు పాలకవర్గ సభ్యులు కర్ణం రామనరసయ్య, బుర్రి వెంకయ్య, సూరోజు రవీంద్రాచారి, ఊటుకూరు సైదులు, పల్లె కాశయ్య, కత్తి శ్రీనివాసరెడ్డి, ధనావత్ సైదులు, రమావత్ వశ్య నాయక్, చింతలచెరువు ప్రియాంక, పోతురాజు జ్యోతి, రెబ్బ రమేష్, పోలా విశ్వనాథంలతో మార్కెట్ కార్యదర్శి సన్నీ గురువారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో పండుగ వాతావరణంలో ప్రమాణ స్వీకారం చేయించి, పదవీ బాధ్యతలు అప్పగించారు.

# వైద్య శాస్త్రంలో అద్భుతం అనస్థీషియా ఆవిష్కరణ

ప్రపంచ అనస్థీషియా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 16న నిర్వహించ బడుతుంది. తొలిసారిగా అనస్థీషియా (మత్తుమందు) ఇచ్చి శస్త్రచికిత్స చేసిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ అనస్థీషి యాలజిస్టుల సంఘం (చిఈూం) ద్వారా ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్16 న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఆఫ్ అనస్థీషియాల జిస్టుల ద్వారా ప్రతి సంవత్సరం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని జరుపుకునే క్రమంలో 150 కంటే ఎక్కువ దేశాల నుండి అనస్థీషియా లజిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 134 కంటే ఎక్కువ సంఘాలు పాల్గొంటాయి.

పూర్వకాలంలో శస్త్ర చికిత్స అనంతరం పుట్టే నొప్పిని తగ్గించేదిగా ఆల్కహాల్ (మదిర) ను గుర్తించి శస్త్ర చికిత్స చేయించుకునే రోగికి ...6వ శతాబ్దానికి చెందిన ఆయుర్వేదానికి చెందిన శస్త్ర చికిత్సకుడు, అపర ధన్వంతరి సుశ్రుతుడు సురాపానం చేయించే వాడు. భరించలేని చాలా నొప్పికి ఉప శమనంగా వైద్యులు, నర్సులు కాకుండా ఇతర మనుషులు గట్టిగా పట్టుకుంటే శస్త్ర చికిత్స చేసేవారు.

అమెరికాలోని మసెచ్యూసెట్ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16వ తేదీన విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు గిల్బర్ట్ అబోట్ అనే రోగిపై ఈథర్ వాయువును ప్రయోగించారు.

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16న గిల్బర్ట్ అంబార్టు గొంతుకు శస్త్రచికిత్స చేసేందుకు... విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు ప్రముఖ దంత వైద్యుడు జాన్‌కొలిన్స్‌తో కలిసి ఈథర్ మత్తు మందు ఇవ్వగా, హార్వర్డ్ మెడికల్ స్కూల్ మొదటి డీన్ అయిన జాన్ కాలిన్స్ వారెన్, అబాట్ మెడలోని కణితి భాగాన్ని నొప్పిలేకుండా తొలగించగా, అలా దిగ్విజయంగా ఆపరేషన్ చేశారు.

ఈథర్. సల్ఫ్యూరిక్ యాసిడ్, ఆల్కహాల్ మిశ్రమాన్ని సంశ్లేషణను ఇందుకు ఉపయోగించారు. 1860ల నాటికి మత్తు మందు విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. 1860ల్లో యాంటీ సెప్టిక్ పద్ధతుల కనిపెట్టిన తర్వాత ఆపరేషన్లు మరింత సులువుగా మారాయి.

ఈ పరిణామం వైద్యశాస్త్రంలో అద్భుతం ఆవిష్కరించడమే గాకుండా మత్తు వైద్య విభాగంలో విప్లవాత్మ కమైన మార్పులకు నాంది పలికింది. ఇది వైద్య చరిత్రలోని అత్యంత ముఖ్యమైన సంఘటనలలో ఒకటిగా నిలిచి పోయింది. ఆ విజయాన్ని పురస్కరించుకుని అప్పటి నుంచి ఏటా అదే రోజున ప్రపంచ అనస్థీషియా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

సాధారణ మత్తు (అనస్థీషియా) ను

## అక్టోబర్ 16...ప్రపంచ అనస్థీషియా దినోత్సవం




నియంత్రితంగా స్పృహను కోల్పోయేలా చెయ్యడానికి ఉపయోగిస్తారు, దీనిని శస్త్రచికిత్సలు నిర్వహించవలసిన అవసరం ఉన్నపుడు ఉపయోగిస్తారు. అనస్థీషియా వైద్య ప్రయోజనాల కోసం ఇవ్వబడేది, ఇది తాత్కా లికంగా స్పర్శను అలాగే స్పృహను కోల్పోయేలా చేస్తుంది.

ఆపరేషన్ సమయంలో అనస్థీషియా ఉపయోగించడం వల్ల రోగి నిద్రాణ స్థితిలో ఉంటాడు. నరాల ద్వారా సంకేతాలు బదిలీకావడాన్ని అనస్తీటిక్స్ నిరోధిస్తాయి, తద్వారా మెదడు నొప్పిని గుర్తించే అనుభూతిని నిరోధిస్తాయి.

ఆపరేషన్ సమయం, శరీర భాగం, వైద్య పరిస్థితి, రోగి వయస్సు తదితరాలను బట్టి మత్తు ఇచ్చే విధానాన్ని ఎంపిక చేసుకుంటారు.

సాధారణ అనస్థీషియాలో... రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు, ఏమీ అనుభూతి చెందరు. స్థానిక అనస్థీషి యాలో... రోగి శస్త్రచికిత్స సమయంలో మెలకువగా ఉంటాడు, నిర్ణీత ప్రాంతాన్ని తిమ్మిరి చేయడానికి మందులు ఇంజెక్ట్ చేయ బడతాయి. ప్రాంతీయ అనస్థీషియాలో... రోగులు మేల్కొని ఉంటారు. శరీర భాగాలు తిమ్మిరిగా ఉంటాయి. మానిటర్డ్ అనస్థీషియా కేర్ అనేది స్థానిక అనస్థీషియాతో పాటు మత్తు, అనల్జీసియాతో పాటుగా డయాగ్నస్టిక్ లేదా థెరప్యూటిక్ విధానాల కోసం సురక్షితమైన విధానంగా మత్తు, రోగి యొక్క ఆందోళనను తగ్గించే చర్యలు, సమర్థవంత మైన నొప్పి నియంత్రణకు ఉపకరిస్తుంది.

బాయల్స్ అనే అనస్థీషియా మిషన్ కనిపెట్ట బడ్డాక, ఈ మిషన్ అనస్థీషియా విభాగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకు వచ్చింది.

దీని ద్వారా ఏకకాలంలో ఒకటి కంటే ఎక్కువ అనస్థీషియా వాయువులను నిర్దిష్టమైన ప్రమాణంలో రోగి శరీరంలోకి పంపించడానికి అవకాశం ఉంటుంది. మత్తుమందు డాక్టర్లు ఉపయోగించే అనేక పరికరాలు రోగి పల్స్, బీపీ, ఆక్సిజన్ స్థాయిలు, కార్బన్‌డైయాక్సైడ్లలను నిరంతరం పర్యవేక్షించడానికి సాయం చేస్తున్నాయి.

రోగులకు ఆపరేషన్లు నిర్వహించడంలో అనస్థీషియా వైద్యులే కీలక పాత్ర పోషిస్తారు.

చిన్న శస్త్ర చికిత్సలు మొదలు కొని అతి క్లిష్టమైన మెదడు, గుండె, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్ర పిండాలు, అవయవాల మార్పిడి, కీళ్ల మార్పిడిని సునాయసంగా చేస్తున్నారు.

అంటే ఐసీయూ, ప్రకృతి వైపరీత్యాలు, దీర్ఘకాలిక నొప్పుల నివారణలోనూ అనస్థీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు.

రోగులకు శస్త్ర చికిత్సకు ముందు సంరక్షణకు అనస్థీటిస్టులు బాధ్యత వహిస్తారు.

ఆపరేషన్ థియేటర్లలో రోగికి మత్తు ఇవ్వడమే గాక అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించడం, ఆఖరి క్షణాల్లో రోగులకు శ్వాస, రక్త ప్రసరణ పునరుద్ధరించడం లో మత్తు వైద్యసేవలు ప్రధాన భూమిక పోషించడం ద్వారా క్రిటికల్ కేర్ విభాగంలో కీలకంగా మారింది. ప్రమాదాలు సంభవిం చి నప్పుడు ట్రామాకేర్ లోనూ, ప్రకృతి విలయాల్లోనూ, మాస్ క్యాజువాలిటిల్లో ముఖ్య భూమిక పోషించడం ద్వారా వైద్యరంగంలో అనస్థీషియా వైద్యులు కీలకంగా మారారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

### రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
### ప్రజా సేవకే ఎమ్మెల్యే పదవి అంకితం చేశా
### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 15:(నేటినిజం ప్రతినిధి): సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కళ్లతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రైతును రాజుగా చూడటమే కాకుండా, రారాజుగా నిలబెట్టాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గురువారం చందుర్తి, సనుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గసికంటి ప్రభాకర్, ఎగలం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుల అభినందన సభలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు సాగునీరు, నాణ్యమైన విద్యుత్, పంటలకు గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా రూ.76 వేల కోట్ల రైతు రుణమాఫీ చేపట్టిందని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని దండగ నుంచి పండుగగా మార్చేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కృషి చేశారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.20,650 కోట్లతో సుమారు 25.28 లక్షల రైతు కుటుంబాలకు రుణమాఫీ ప్రయోజనం కల్పించినట్లు వివరించారు. రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించడం, కనీస మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేయడం ద్వారా రైతుల్లో నమ్మకం పెరిగిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, దళారుల సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వేములవాడ నియోజకవర్గంలో సాగునీటి సమస్యల పరిష్కారానికి



ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆది శ్రీనివాస్ తెలిపారు. గతంలో తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతుల సమస్యల పరిష్కారం కోసం పాదయాత్రలు చేసి, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లిన అంశాలను ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించే అవకాశం లభించిందన్నారు. కలికోట సురమ్మ ప్రాజెక్టుకు సంబంధించి సుమారు రూ.80 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నామని, ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 48 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. అదేవిధంగా సాగునీటి వనరుల అభివృద్ధి, చెరువులకు నీటి సరఫరా, ఎత్తిపోతల పథకాల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో ప్రారంభమైన పలు సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేయడంతో పాటు, రైతులకు వేసవిలోనూ సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందితేనే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని అన్నారు.

వేములవాడ నియోజకవర్గంలో గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఊపునిచ్చామని ఆది శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో సుమారు రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, వంతెనలు, విద్యుత్ వంటి రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. రుద్రంగి ప్రాంతంలో వ్యవసాయానికి సంబంధించిన సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు, యువతకు నాణ్యమైన విద్య అందించేందుకు విద్యాసంస్థల ఏర్పాటుపైనా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి ద్వారా నియోజకవర్గానికి మరింత గుర్తింపు తీసుకురావడమే కాకుండా, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

ఎమ్మెల్యే పదవిని హోదాగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తున్నానని ఆది శ్రీనివాస్ అన్నారు. తన రాజకీయ ప్రస్థానం 1995లో ప్రారంభమైందని, జెడ్పీటీసీ సభ్యుడిగా, ఇతర ప్రజాప్రతినిధి బాధ్యతల్లో పనిచేస్తూ ప్రజలకు దగ్గరయ్యానని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజల తరఫున పోరాడిన సమస్యలను, అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించే అవకాశం రావడం తనకు సంతోషంగా ఉందన్నారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

బీసీ, మైనారిటీ, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, సామాన్య ప్రజలు సైతం అభివృద్ధి ఫలాలను అందుకునేలా పనిచేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు చురుగ్గా వ్యవహరించాలని ఆది శ్రీనివాస్ సూచించారు.

గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చూడాలని, పంటల కొనుగోలు విషయంలో వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

రాజకీయాల్లో అందరికీ ఒకేసారి అవకాశాలు కల్పించడం సాధ్యం కాకపోయినా, పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.




# భారత దేశ కొబ్బరి పీచు రంగం: జీవనోపాధి అవకాశాలు సృష్టిస్తూ, పరిశ్రమలకు ప్రోత్సాహమివ్వడంతో పాటు సుస్థిర వృద్ధికి ఊతం



న్యూఢిల్లీ, అక్టోబర్ 15:ప్రపంచంలో కొబ్బరి పీచును మరే దేశం కన్న ఎక్కువగా ఉత్పత్తి చేయడంతో పాటు ఎగుమతి చేస్తున్న దేశం భారత్. సంప్రదాయాలకు విలువనిచ్చే భారత్‌లో నూతన ఆవిష్కరణలు కూడా పురోగమిస్తున్నాయి. కొబ్బరి పీచు రంగం ఆర్థిక, సామాజిక పురోగతికి పర్యావరణానుకూలమైన, నిలకడ కలిగిన రంగంగా ఎదుగుతున్నది. ఈ రంగం కొబ్బరి పొట్టును లాభసాటిగా వినియోగించడాన్ని ప్రోత్సహించడం ఒక్కటే కాకుండా, పల్లె ప్రాంతాల్లో సాంప్రదాయిక చేతి వృత్తి బృందాలకు బతుకుదెరువును చూపుతూ, వారి ఎదుగుదలకు తోడ్పడుతున్నది. స్థిర ప్రాతిపదిక, విలువ జోడింపు, అభివృద్ధి ఫలాలు అందరికీ అందేటట్లు చూడటంపై ఈ రంగం ప్రత్యేకంగా దృష్టి పెడుతూ, 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా నిలిచే దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో ఓ కీలక పాత్రను పోషిస్తోంది.

కొబ్బరి పీచును వాడి తయారుచేస్తున్న చాపలు, పరుపులు, తాళ్లు, బ్రష్షులు, ఇతర ఉపయోగకర వస్తువులు పర్యావరణానికి ఎలాంటి హానీ చేయకుండా, మన్నిక కలిగిన ఉత్పాదనలుగా ఉంటూ మన అందరి నిత్య జీవితంలో ఓ భాగంగా మారుతున్నాయి. అయితే ఇంతకూ ఈ కొబ్బరి పీచు అంటే ఏమిటసలు?

కొబ్బరి పీచు ఒక ప్రకృతిసిద్ధ సామగ్రి. కొబ్బరికాయలపై గట్టిగా అంటిపెట్టుకుని ఉండే దీనిని వలుస్తారు. ఇది పీచు రూపంలో ఉంటుంది. ఈ ప్రాకృతిక నారను శుద్ధిపరిచి, అనేక రకాలైన వాణిజ్య ఉత్పాదనలుగా రూపొందిస్తారు. కొబ్బరి పీచు రంగం భారతదేశలో అత్యంత ప్రాచీన, సంప్రదాయ పరిశ్రమల్లో ఒకటి. ఇది పర్యావరణ మిత్రపూర్వక తయారీ రంగాల్లో ఒకటి. దీనిలో కొబ్బరి డిప్పలు, పీచును కొబ్బరికాయల నుంచి వేరు చేసి, శుద్ధి పరిచి, విలువను జత చేసి ఉత్పాదనల రూపంలో తీర్చి దిద్దుతారు.

### భారతదేశంలో కొబ్బరి పీచు రంగం:-

ప్రపంచంలో అతి పెద్ద కొబ్బరి పీచు, పీచు ఉత్పాదనల ఉత్పత్తిదారు, ఎగుమతిదారు దేశంగా పేరు తెచ్చుకుంది భారత్. ప్రపంచం మొత్తంమీద మూడింట రెండు వంతుల కొబ్బరిని భారత్ అందిస్తోంది. భారతదేశ కొబ్బరి పీచు పరిశ్రమ టర్నోవరు దాదాపుగా రూ.16,000 కోట్లు. భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో సుమారు 1 శాతాన్ని ఈ పరిశ్రమ సమకూరుస్తోంది.

భారత్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతి చేసిన కొబ్బరి నార, పీచు ఉత్పత్తుల విలువ రూ.6,614.40 కోట్లుగా లెక్కకు వచ్చింది. భారత్ కొబ్బరి పీచు ఉత్పాదనలను ప్రధానంగా అమెరికా, చైనా, నెదర్లాండ్స్, స్పెయిన్, బ్రిటన్‌లకు ఎగుమతి చేశారు. కొబ్బరి బెండు, పీచు, దారం, యంత్రాల సాయంతో రూపొందించిన కాలి పట్టాలను, చాపలను వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

భారతదేశ కొబ్బరి పీచు రంగంలో పనిచేస్తున్న యూనిట్లు 21,000కు మించి ఉన్నాయి. ఇవి 7 లక్షల కన్నా ఎక్కువ మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని కల్పిస్తున్నాయి. ఈ రంగంలో పనిచేస్తున్న వారిలో 80 శాతం మంది గ్రామీణ కుటుంబాలకు చెందిన మహిళలు.

మహారాష్ట్రలో సింధుదుర్గ్ జిల్లాకు చెందిన శ్రీమతి రంజన రామ్‌చంద్ర కదమ్ తాను ఔత్సాహిక వాణిజ్య వేత్త కావాలన్న కలను 'ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎమ్ఈజీపీ)'అండతో నెరవేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమెకు కాయర్ బోర్డు మార్గదర్శకత్వాన్ని అందించింది. ఆమె కాయర్ యూనిట్టును ఏర్పాటు చేయడానికి బోర్డు సాయపడింది. ఆమె ఓ షెడ్డును నిర్మింపచేసుకొని, వ్యాపారాన్ని ఆరంభించడానికి అవసరమైన యంత్ర పరికరాల్ని కొనుగోలు చేశారు. ఆమె ఏర్పాటు చేసిన కర్మాగారంలో ప్రస్తుతం కొబ్బరి పీచుతో తాళ్లు, దిళ్లు, డోర్‌మ్యాట్లను తయారు చేస్తున్నారు. ఈ సంస్థతో ఆమె ఆరుగురికి పూర్తి స్థాయి ఉపాధిని కల్పించారు.

కేరళలోని కోజికోడ్‌లో శ్రీ సురేంద్రన్ పి. మార్గదర్శకత్వంలో సంపూర్ణ ప్లస్ అగ్రో ఫర్టిలైజర్ ఎంటర్‌ప్రైజెస్ నడుస్తున్నది. ఈ సంస్థకు కణ్ణూర్‌లో గల కాయర్ బోర్డు ఉప- ప్రాంతీయ కార్యాలయంతో పాటు కలావుర్‌లోని కేంద్ర కొబ్బరి పీచు పరిశోధన సంస్థ (సీసీఆర్ఐ)లు శిక్షణను, సాంకేతిక మార్గదర్శకత్వాన్ని సమకూర్చాయి. కొబ్బరి బెండు నుంచి బయో-ఫర్టిలైజరును తయారు చేయడం, ఆ ఎరువును ప్రభావవంతంగా ఉపయోగించడాన్ని గురించిన ప్రత్యక్ష శిక్షణ కార్యమాల్లో, డెమాన్‌స్ట్రేషన్లు, అవగాహన కార్యక్రమాల్లో శ్రీ సురేంద్రన్ పి. చురుకుగా పాల్గొన్నారు. ఆయన స్థాపించిన వాణిజ్య సంస్థ 500 కన్న ఎక్కువ మంది వినియోగదారులను కేవలం ఒక సంవత్సర కాలంలో సంపాదించుకుంది. ఈ యూనిట్టు 20 టన్నుల కన్న ఎక్కువ కాయర్ పిథ్ బయో-ఫర్టిలైజర్ విక్రయాలను కూడా నమోదు చేసింది. ప్రస్తుతానికి ఈ యూనిట్టులో ఇద్దరు మహిళలు సహా అయిదుగురు కార్మికులు పనిచేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన శ్రీమతి అల్లం గౌతమి అయిదు సంవత్సరాల కిందట కాయర్ బోర్డ్ ట్రయినింగ్ సెంటర్లో శిక్షణ పొందారు. సాంకేతిక మార్గదర్శకత్వం అందించిన స్ఫూర్తితో ఆమె తన సొంత వాణిజ్య సంస్థ అదిగో కాయర్ ప్రోడక్ట్స్‌ను స్థాపించారు. పీఎమ్ఈజీపీ లో భాగంగా ఆమెకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇవాళ, ఈ యూనిట్టు దాదాపు రూ.35 లక్షల వార్షిక టర్నోవరును సాధించింది. ఈ సంస్థ వార్షిక లాభం సుమారు రూ.10 లక్షలుగా ఉంది. ఈ సంస్థ ఆరుగురు మహిళలకు జీవనోపాధిని కల్పించింది. రాజమండ్రి కాయర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం, మండల పరిషత్ అధికారుల అండదండలతో ఆమె శిక్షణ కార్యక్రమాలను కూడా చురుకుగా నిర్వహిస్తున్నారు. కొబ్బరి నారతో చాప అల్లడంలో, తాళ్ల తయారీలో, హస్తకళల ఉత్పాదనల్లో ఇంతవరకు సుమారు 120 మంది మహిళలకు శిక్షణను అందించారు.

కేరళలో ఆలప్పుళ నివాసి శ్రీ జి. సామూ పీఎమ్ఈజీపీలో భాగంగా కలావుర్ లోని కాయర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం నుంచి సాయాన్ని అందుకుని, కొబ్బరి పీచును వడికే యూనిట్టును 2024లో నెలకొల్పారు. రెండు సంవత్సరాల్లో ఈ యూనిట్టు కాయర్ యార్న్, తాళ్లను ఉత్పత్తి చేయడంలో ప్రావీణ్యాన్ని సాధించగలిగింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.